ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

మంగళవారం | 23-06- 2026 | సంపుటి: 17, సంచిక: 80, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

### అన్ని వసతులతో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను

# అభివృద్ధి చేయండి

### కార్గో.. ఎంఆర్‌వో వసతులు కల్పించాలి

**హ్యాంగర్ ఏర్పాటుకు అత్యంత అనుకూలం - దేవరకద్రలో డీఆర్‌డీవో ప్రాజెక్టు మంజూరు చేయండి**

**రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి**

**గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు భూములు బదలాయించినందుకు కృతజ్ఞతలు తెలిపిన సీఎం**



ఢిల్లీ: భారత వాయు సేన ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అన్ని వసతులతో అభివృద్ధి చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని రక్షణ శాఖ కార్యాలయం కర్తవ్య భవన్‌లో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు అంశాల్లో పూర్తిగా సహకరిస్తామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఆదిలాబాద్‌లో భారతీయ వాయు సేన ఆధ్వర్యంలో రానున్న ఎయిర్‌పోర్ట్ దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందున, దానిని భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహకరిస్తామని రక్షణశాఖ మంత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎంఆర్‌వో, హ్యాంగర్ సౌకర్యాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఇటీవల మధ్య ఆసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి సరైన ప్రదేశాలను అన్వేషిస్తున్నాయని, హ్యాంగర్ ఏర్పాటుకు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అత్యంత అనుకూలమైనందున ఆ దిశగా అభివృద్ధి చేయాలని రక్షణ శాఖ మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. తమ కీలకమైన ప్రాజెక్టు ఏర్పాటుకు డీఆర్‌డీవో/డీఆర్‌డీఎల్ మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీప ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నందున ఆ ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీ వికాస్‌రాజ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కే.ఎస్.శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.



### సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో

# వేగం పెంచాలి

**జిల్లాకో మండలంలో ఇంటిగ్రేటెడ్ భూభారతి అమలుకు యోచన**

**ఏడాది కాలంలో 3.65 లక్షల పాస్‌బుక్‌ల జారీ**

**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

హైదరాబాద్, జూన్ 22 (ప్రజాకలం) : రైతు భూమికి చట్టబద్ధమైన రక్షణ, స్పష్టమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందన్నారు.
సోమవారం నాడు రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గారు మాట్లాడుతూ భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన 2025 ఏప్రిల్ 14 నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 3.65 లక్షల పాస్‌బుక్‌లు జారీ చేసినట్లు వెల్లడించారు.
గతంలో పాస్‌బుక్ కోసం రైతులు నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితులకు ముగింపు పలుకుతూ రైతు దరఖాస్తు చేసిన వెంటనే పాస్‌బుక్ అందే విధంగా వ్యవస్థను పారదర్శకంగా, వేగవంతంగా రూపొందించామని చెప్పారు. రైతు ఒక్కసారి దరఖాస్తు చేస్తే తిరిగి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు.

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్





### కేటీఆర్ సినిమా డైలాగులు

# మానుకోవాలి

### ప్రజల కోణంలో మాట్లాడాలి: ఎంపీ చామల

**సీఎం రేవంత్‌రెడ్డిపై బావ, బామ్మర్దులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు**

**కేటీఆర్ పదేళ్లు అధికారంలో ఉండి సినిమా వాళ్లతో అంటకాగి సినిమా మాటలు మాట్లాడుతున్నారు**

**బీఆర్ఎస్ పదేళ్ల పాలన సూపర్ హిట్ అనుకుంటున్నారా..?**

**హైడ్రా పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారు..**

భువనగిరి, జూన్ 22 (ప్రజాకలం) : తెలంగాణ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ఓ విజన్‌తో ముందుకెళ్తుంటే మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు జీర్ణించుకోలేక పోతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌తో విద్య, వైద్యం, రైతులకు మేలు చేయాలనే ఆలోచనతో సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు పోతున్నారని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై బావ, బామ్మర్దులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. సోమవారం భువనగిరిలో ఎంపీ చామల పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ పదేళ్లు అధికారంలో ఉండి సినిమా వాళ్లతో అంటకాగి సినిమా మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయంలో సినిమా మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు.

**బీఆర్ఎస్ పదేళ్ల పాలన సూపర్ హిట్ అనుకుంటున్నారా..?**

ప్రజల జీవితాలు కేటీఆర్‌కు సినిమాలాగా కనపడుతున్నాయా..? అని కిరణ్ కుమార్ రెడ్డి ఆగ్రహించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన సూపర్ హిట్ అనుకుంటున్నారా...?

తరువాయి 2వ పేజీలో...



### జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో

# 50 శాతం రాయితీ కల్పించాలి


**- టీయూడబ్ల్యూజే ఐజేయు అధ్యక్ష కార్యదర్శులు డా. బూరం సంజీవ్, మహమ్మద్ అజీమ్ : ప్రజావాణి లో వినతి**

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 22 (ప్రజా కలం) జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో 50 శాతం రాయితీ కల్పించాలని కోరుతూ మెట్ పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో రెవెన్యూ డివిజన్ అధికారి జి. నరసింహా రావు కు వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన రెవెన్యూ డివిజన్ అధికారి. జర్నలిస్టుల పిల్లలకు పాఠశాలలలో 50 శాతం ఫీజు రాయితీ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిఈవో రాము ను ఆదేశించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బూరం సంజీవ్,మహమ్మద్ అజీమ్ లు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులు. జర్నలిస్టు వృత్తినే సామాజిక సేవగా భావిస్తూ పనిచేస్తున్న చాలామంది జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యను అందించే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ కల్పించడానికి ప్రైవేట్ విద్యా సంస్థలు కూడా సహకరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జంగం విజయ్, అఫ్రోజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సాజిద్ పాషా, బాసెట్టి హరీశ్, గౌరవ సలహాదారులు దాసం కిషన్, క్యాషియర్ మక్సూద్, జాయింట్ సెక్రెటరీ పుంద్ర శశికాంత్ రెడ్డి, పింజర్ శివ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి సమీయుద్దీన్, కార్యవర్గ సభ్యులు పొనగాని మహేందర్, కుర్ర రాజేందర్ ,యానం రాకేశ్,రఫీ ఉల్లా, సోహెల్ , హైమద్, ముత్యాల రమేష్ , ఓంకారి శ్రీనివాస్,బొల్లం రాజు,మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్ సభ్యులు ఆదిల్ పాషా, రమణ, ఏసమేని గణేశ్, శశి కుమార్, అమ్ముల ప్రవీణ్ ,తదితరులు పాల్గొన్నారు.

## రైతుబంధు లేదు, రైతు బీమా లేదు

**రైతులను రేవంత్ సర్కార్ మోసం: హరీశ్ రావు**

**కార్యకర్తల సమావేశంలో హరీష్ మాట్లాడుతుండగా పవర్ కట్**



అచ్చంపేట, జూన్ 22 (ప్రజాకలం) : ఎన్నికల ముందు వరకు వడ్లు పండిస్తే కొంటామన్నారు.. ఇప్పుడు కేంద్రం ఎంత కొనమంటే అంతే కొంటామంటున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అచ్చంపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ... యాసంగికి 50 లక్షల టన్నుల కొనుగోలుకే కేంద్రం ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని పేర్కొన్నారు. వచ్చే ఏడాదికి అదే 50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తారని తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

### ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు

# సమన్వయంతో పనిచేయాలి

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే సభ ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో పరిశీలన**

**- చింతకాని మండలంలో సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లకు అనువైన స్థలాలను పరిశీలించిన డిప్యూటీ సీఎం**



ఖమ్మం, జూన్ 22(ప్రజా కలం న్యూస్ ) ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలంలో జూన్ 30న నిర్వహించనున్న సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లను సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీసు కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల అధికారులతో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన ప్రాంతాలను సందర్శించి సమగ్రంగా పరిశీలించారు.

తరువాయి 2వ పేజీలో...

# రైతులకు భరోసా..

### విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి

**- అధికారులతో ఎమ్మెల్యే విజయరమణ రావు సమీక్ష**



పెద్దపల్లి,జూన్ 22: (ప్రజాకలం జిల్లాప్రతినిధి) వానాకాలం సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు మరియు విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా

తరువాయి 2వ పేజీలో...

## సాదాబైనామా దరఖాస్తుల
# పరిష్కారంలో వేగం పెంచాలి

మొదటి పేజీ తరువాయి...

భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూముల క్రయవిక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ జత చేసే నిబంధనను ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఐదు మండలాల్లో పరిస్థితులను మంత్రిగారు సమీక్షించారు. ఈ విధానం విజయవంతంగా కొనసాగుతోందని అధికారులు వివరించగా, అక్కడి అనుభవాలు, సమస్యలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే రెండో దశలో ప్రతి జిల్లాకు ఒక మండలంలో అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

అలాగే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని మంత్రి గారు ఆదేశించారు. మొత్తం 9.25 లక్షల సాదాబైనామా దరఖాస్తులలో, ఇప్పటివరకు ఆరు లక్షల దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలియజేశారు. మిగిలిన దరఖాస్తులకు వచ్చే 15 రోజుల్లో నోటీసులు జారీ పూర్తి చేయాలని, ఆ తర్వాత 30 రోజుల గడువు ముగిసిన వెంటనే అర్హులైన దరఖాస్తులను పరిష్కారించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం సాదాబైనామా అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. దరఖాస్తులు స్వీకరించినప్పటికీ వాటి పరిష్కారానికి 2020 ఆర్వోఆర్ చట్టంలో సరైన నిబంధనలు లేకపోవడం వల్ల వేలాది మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కానీ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తమ ప్రభుత్వం నిబంధనలను సవరించి దరఖాస్తుదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టిందని తెలిపారు.

# కేటీఆర్ సినిమా డైలాగులు మానుకోవాలి

మొదటి పేజీ తరువాయి...

అని ప్రశ్నించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో మిగులు రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా మారిందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన షోలే సినిమా కాదని వ్యంగ్యంగా అన్నారు. రేవంత్‌రెడ్డి రెండున్నరేళ్ల పాలన గురించి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని సెటైర్లు గుప్పించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అయ్యాయని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించి క్రాప్ డైవర్షన్‌పై అవగాహన కల్పిస్తున్నారని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో పండించిన ధాన్యం అత్యధిక దిగుబడి వస్తే కేంద్రప్రభుత్వం ఎందుకు కొనట్లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారని తెలిపారు.

**హైడ్రా పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారు..**

మెట్రోఫేజ్- 2 కోసం సంప్రదింపులు చేసి ఎల్ అండ్‌టీకి ఎగ్జిట్ ఇచ్చారని.. మెట్రోఫేజ్ -2ను పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని కిరణ్ కుమార్ రెడ్డి వివరించారు. మెట్రోఫేజ్-2పై బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. మెట్రోఫేజ్ -2పై కిషన్ రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారని ప్రస్తావించారు. కేంద్రమంత్రుల అపాయింట్‌మెంట్ ఇప్పించాలని.. కలిసి అభివృద్ధిలో ముందుకెళ్దామని సీఎం అంటున్నారని అన్నారు. కేటీఆర్ బాధ్యతతో ప్రజల కోణంలో మాట్లాడాలని హితవు పలికారు. హైడ్రా పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. హైడ్రా హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలకంగా మారిందని తెలిపారు. నాళాలు కబ్జాలు చేసి నిర్మాణాలు చేపట్టాలని హైడ్రా భావిస్తోందా...? అని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరం ముంపునకు గురికాకుండా హైడ్రా కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. బీజేపీ ఓటు, సీటు చోరీల గురించి కేటీఆర్ ఎందుకు మాట్లాడట్లేదని ఫైర్ అయ్యారు. కేటీఆర్, హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై చిత్తశుద్ధి లేని మాటలు మాట్లాడుతున్నారని కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు
# సమన్వయంతో పనిచేయాలి

మొదటి పేజీ తరువాయి...

అనంతరం జగనాథపురం ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలను మరింత చేరువ చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయడం ప్రతి శాఖ బాధ్యత అని అన్నారు. సభకు భారీ సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లను ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

సభా వేదిక నిర్మాణం, హెలిప్యాడ్ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ప్రజల కూర్చునే ఏర్పాట్లు, ప్రవేశ మరియు నిష్క్రమణ మార్గాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ప్రోటోకాల్ ఏర్పాట్లు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. అలాగే సభకు హాజరయ్యే రైతులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, భద్రతా బందోబస్తు వంటి అంశాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.

పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని సభా ప్రాంగణం వద్ద మరియు ప్రధాన రహదారులపై ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, ప్రజల రాకపోకలు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమగ్ర బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఎండి వరుణ్ రెడ్డి, రవాణా శాఖ కమిషనర్ డా. కె. ఇలంబర్తి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు భరోసా.. విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి

మొదటి పేజీ తరువాయి...

వ్యవహరించాలని ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఆదేశించారు.పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులు,జిల్లా సహకార అధికారి మరియు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులతో ఆయన ముందస్తు సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ వానాకాలంలో ఈదురుగాలుల ప్రభావంతో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.నియోజకవర్గంలో అవసరమైన కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని,క్షేత్రస్థాయిలో సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు.ముఖ్యంగా పెద్దపల్లి ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా చేపట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించి,సురక్షిత ప్రాంతాలకు మార్చాలని విద్యుత్ శాఖ అధికారులకు స్పష్టం చేశారు.అదేవిధంగా వ్యవసాయ రంగానికి సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలు సకాలంలో సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు.మార్కెట్‌లో నకిలీ విత్తనాల విక్రయాలపై కఠిన నిఘా ఉంచాలని,ఏ ఒక్క రైతు కూడా నకిలీ విత్తనాల బారిన పడకుండా చూడాలని అధికారులను హెచ్చరించారు.విత్తన విక్రయాలు నిబంధనలకు అనుగుణంగా సజావుగా సాగాలని,రైతులు కేంద్రాల వద్ద ఇబ్బంది పడకుండా డిజిటల్ ఎంట్రీలు మరియు స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.ఎరువుల నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా సహకార అధికారి శ్రీమాల కి ఆదేశాలు జారీ చేశారు.ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల,విద్యుత్ శాఖ ఎస్.ఈ గంగాధర్,డి.ఈ రాజబ్రహ్మాచారి, వివిధ విభాగాల ఏఈలు,ఏడీఈలు,పాక్స్ కార్యదర్శులు,తదితరులు పాల్గొన్నారు.

# రైతుబంధు లేదు, రైతు బీమా లేదు

మొదటి పేజీ తరువాయి...

సగం వడ్లు కొంటే మిగతా సగం రైతులు బయట అమ్ముకోవాలన్నారు. రుణమాఫీ, రైతుబంధు, పంట కొనుగోలులో మోసం ప్రభుత్వానిదన్నారు. పాలమూరు జిల్లాలో ఒక్క సీటు మొలకెత్తనీయం అని చెబుతున్నారు. రేవంత్ సర్కార్‌లో రైతులకు బోనస్ రావడం లేదు, రైతులకు కనీసం కరెంట్ కూడా ఇవ్వండం లేదు, రేవంత్ ప్రభుత్వం పూర్తిగా రైతులను మోసం చేసిందని ధ్వజమెత్తారు. రేవంత్ మోసాలను ఎండగట్టే బాధ్యత రైతులు తీసుకోవాలని హరీశ్ రావు కోరారు. కేసీఆర్ ఉన్నప్పుడు రైతుబంధు ఎప్పుడైనా అగిందా? అని ప్రశ్నించారు. ఇప్పుడు రైతుబంధు లేదు, రైతు బీమా కూడా లేదన్నారు. రేవంత్ రెడ్డి దేవుళ్ళ మీద ప్రమాణం చేసి మోసం చేసిన వీడియోలను హరీష్ రావు కార్యకర్తల ముందు ప్రదర్శించారు. అచ్చంపేట బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతుండగా పవర్ కట్ కావడం విశేషం.

**కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

రాష్ట్రంలో రైతులకు రూ.29,300 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉండగా, ఎన్నికల సమయంలో 45 రోజుల్లో రూ.90 వేల కోట్లు అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆరోపించారు. సోమవారం అచ్చంపేటలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం 11 విడతల్లో రైతుబంధు కింద రూ.73 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసిందని గుర్తు చేశారు. రైతుల పట్ల సీఎం రేవంత్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సన్నధాన్యానికి ఎకరాకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి అమలు చేయలేదని, ధాన్యం కొనుగోళ్ల విషయంలో కూడా రైతులను మోసం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రతి సీజన్‌లో 1.45 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుంటే అందులో సగం మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెప్పడం రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనమన్నారు. రైతు బీమా అమలులోనూ ప్రభుత్వం విఫలమైందని, ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించకపోవడంతో పథకం నిలిచిపోయిందన్నారు.

ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా రంగ అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించినప్పటికీ ఖర్చు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో అనేక కళాశాలలు మూతపడటంతో విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలమూరు ప్రాజెక్టుల ద్వారా వేల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం, మన్నెవారిపల్లి రైతుల సమస్యలు, బాధితులకు నష్టపరిహారం వంటి అంశాల్లో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చిన హరీష్ రావు, ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్లకు నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ వంద సీట్లతో తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

### ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకోవాలి - రాజేంద్రనగర్‌లోని రాయల్ హాయత్ కన్వెన్షన్ ఇందిరా మహిళా శక్తి' చీరల పంపిణీ చేసిన - రాజేంద్రనగర్ శాసనసభ్యులు ఎమ్మెల్యే ప్రకాష్

రాజేంద్రనగర్, జూన్ 22, (ప్రజా కలం) మహిళల ఆర్థిక, సామాజిక ఉన్నతే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాజేంద్రనగర్ శాసనసభ్యులు ఎమ్మెల్యే శ్రీ ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో "ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ" కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి మహిళలకు చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల సాధికారత, వారి ఉన్నతే తెలంగాణ ప్రగతికి అసలైన నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఇందిరా మహిళా శక్తి పథకాలు ప్రతి మహిళకూ అండగా నిలుస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని మహిళలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ సదరు కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో మహిళలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.




# ఖిల్లాను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

**భువనగిరి ఖిల్లా అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి జూపల్లి - కొండపైన జరుగుతున్న అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష**

**2047 నాటికి తెలంగాణ ను అంతర్జాతీయ స్థాయి పర్యటక కేంద్రంగా మారుస్తాం**

**ఖిల్లా చుట్టూ రూప్ వే..హోటల్..పార్కింగ్..రెస్ట్ రూమ్..చిల్డ్రన్ ప్లే..గార్డెన్ లు పర్యాటకులకు మౌలిక సదుపాయాలు**

**స్వదేశ్ దర్శన్ స్కీం 2.0 వ్యయంతో రూ.56.81 కోట్ల అంచనాతో అభివృద్ధి**

**పగలు రాత్రి పనులు చేపట్టాలి..అక్టోబర్ 2 నాటికి పనులు పూర్తి చేయాలి - యువతకు మెండుగా ఉపాధి అవకాశాలు**

యాదాద్రి భువనగిరి, జూన్ 22 :

భువనగిరి కోట పర్యాటక అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించిన మంత్రి జూపల్లి కృష్ణారావు కార్యక్రమంలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి , భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిశ, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి , జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి , పురావస్తు శాఖ డైరెక్టర్ డా. అర్జున రావు , అధికారులు , స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.సోమవారం రోజు భువనగిరి లో కోట క్రింద రోప్ వే , హోటల్ నిర్మాణం , పర్యాటకులకు మౌలిక సదు పాయాలు , కొండ పైన జరుగుతున్న అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష నిర్వహించారు.

అధికారులు , అక్కడ అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతి నిధులతో మంత్రి మాట్లాడారు. వివిధ విభాగాల ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల పురోగతి పై మంత్రి ఆరా తీశారు. పనుల్లో తీవ్ర జాప్యం జరిగిందని అసహనం వ్యక్తం చేశారు.కొండ క్రింద (లోయర్ స్టేషన్ లో) రోప్ వే నిర్మాణం , హోటల్ , పార్కింగ్ , రెస్ట్ రూమ్స్ , చిల్డ్రన్ ప్లే ఏరియా , రాక్ గార్డెన్ కు విద్యుత్ దీపాల అలంకరణ , కొండపైన (అప్పర్ స్టేషన్) కోట పున రుద్ధరణ , వాటర్ బాడీస్ బ్యూటిఫికేషన్ , కేఫే టెరియా , కోట చరిత్రని తెలియజేయడానికి ఇంటర్ప్రిటేషన్ సెంటర్ , మెట్ల పునరుద్ధరణ , ఎంట్రన్స్ ప్లాజా , టికెట్ కౌంటర్ , వెయిటింగ్ లాంజ్ , రెస్టారెంట్ , పర్యాటకులకు మౌలిక సదుపాయాల పై సుదీర్ఘంగా చర్చించారు. భువనగిరి ఖిల్లాను అత్యంత ఆధునీకరణ చేస్తున్నాం. కోట వైభవం ఉట్టిపడేలా దీనిని తీర్చి దిద్దుతున్నాం. అక్టోబర్ 2 నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.అధికారులు పనులను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. పగలు , రాత్రి పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి




నాయకత్వంలో పర్యాటక అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.గత పాలకులు పర్యాటకాన్ని నిర్లక్ష్యం చేశారు. కనీస వసతులు కూడా కల్పించలేదు. నూతన పర్యాటక విధానాన్ని తీసుకువచ్చి పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం. తెలంగాణను దేశంలోనే అత్యంత ప్రాధాన్య పర్యాటక గమ్య స్థానంగా తీర్చిదిద్దడం , పర్యాటకం ద్వారా సంపద సృష్టి , ఉద్యోగ ఉపాధి కల్పన లక్ష్యంగా హోసమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం. 2047 నాటికి తెలంగాణను అంతర్జాతీయ స్థాయి ఆధాత్మిక , వారసత్వ సాంస్కృతిక పర్యాటక కేంద్రంగా మార్చడమే మా ప్రభుత్వ లక్ష్యం. యాదాద్రి, భువనగిరి కోట, కొలను పాకలను అనుసంధానిస్తూ సమగ్ర ఆధ్యాత్మిక- వారసత్వ పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు చేపడు తోంది. తెలంగాణలోనే కాకుండా , భారతదేశం మొత్తంలోనే అత్యంత విశిష్టమైన బౌద్ధ వారసత్వ క్షేత్రాల హోపరిరక్షణ , పున రుద్ధరణకు ప్రభుత్వం కృషి చేస్తోంది.దేశ, విదేశీ పర్యాట కులకు అన్ని రకాల వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.స్వదేశ్ దర్శన్ స్కీమ్ 2.0 కింద వ్యయం రూ. 56.81 కోట్ల అంచనా వ్యయంతో భువనగిరి ఖిల్లాను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నాం. వార సత్వ పరిరక్షణ , ఆధునిక సదుపాయాలు , పర్యాటక అనుభవాల మెరుగుదల , రోప్ వే ఏర్పాటు ద్వారా పర్యాటకుల సంఖ్య పెరుగు తుంది. రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషికి తెలంగాణ ప్రజలు మద్దతు తెలపాలి. కనీసం నెలకు రెండు సార్లు పర్యాటక ప్రాంతాలను సందర్శించి, తెలంగాణ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని కోరారు. కుటుంబంతో ఆహ్లాదంగా గడపడం వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుంది. ఆలోచన విధానం మెరుగు పడుతుందని అన్నారు.భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లడుతూ రోప్ వే పనుల పరిశీలన పర్యాటకులకు ఎంతగానో ఉపయోగపడే భువనగిరి ఖిల్లా రోప్ వే పనుల ప్రగతిని వారు ప్రత్యేకంగా పరిశీలించారు.తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యం లో కోట పరిసరాల్లో ప్రస్తుతం కొన సాగుతున్న వివిధ పర్యాటక రంగ అభివృద్ధి పనులను, మౌలిక వసతుల కల్పనను వారు నిశితంగా పరిశీలించారు.ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ మాట్లాడుతూ భువనగిరి కోటను రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ముఖ్యంగా పర్యాటకుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న రోప్ వే పనులను ఎలాంటి ఆలస్యం లేకుండా అత్యంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను కాంట్రాక్టర్లను ఆదేశించారు. కొనసాగుతున్న అన్ని అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని అన్నారు. భువనగిరి నియోజకవర్గ పరిధిలో పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి , ఆధునిక వసతుల కల్పనకు పెద్దపీట వేసేలా తమ వంతు పూర్తి సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

## - జిల్లా రైతు నాయకుల డిమాండ్



మెట్‌పల్లి: కోరుట్ల ప్రతినిధి జూన్ 22 (ప్రజా కలం) పసుపు, మక్కల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, చెరుకు ఫ్యాక్టరీ పునరుద్ధరణ వంటి రైతు సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన శాంతియుత ఆందోళనల సందర్భంగా రైతులపై నమోదు చేసిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని జిల్లా రైతు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మెట్‌పల్లి పాత బస్టాండ్ చౌరస్తాలో రైతులు సమావేశమై తమ ఆవేదనను వ్యక్తం చేశారు. 2021లో జిల్లా రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో సుమారు 5,000 మంది రైతులు పాల్గొన్న శాంతియుత ధర్నా సందర్భంగా అప్పటి ప్రభుత్వం కక్షపూరితంగా 36 మంది రైతులపై అక్రమ కేసులు నమోదు చేసిందని ఆరోపించారు. వ్యవసాయంపై ఆధారపడి జీవించే రైతులు పంటలు, పశువుల సంరక్షణను పక్కనబెట్టి కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. గత ఐదేళ్లుగా కేసుల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొంటూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులపై నమోదైన కేసులను వెంటనే రద్దు చేసి న్యాయం చేయాలని కోరారు. రైతుల సమస్యలపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసి అధికారులకు వినతిపత్రం అందించేందుకు వెళ్లిన తమపై కేసులు నమోదు చేయడం అన్యాయమని అన్నారు. రైతు శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రజాపాలనలో తమకు న్యాయం జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, కోడిపెల్లి గోపాల్ రెడ్డి,బి. మల్లయ్య, బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఆలూరి మహేందర్ రెడ్డి,మారు మురళీధర్ రెడ్డి, వేములకర్ణాకర్ రెడ్డి, నాగుల వామన్ రెడ్డి, ఏలేటి మహిపాల్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

# వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

**పోలీసు నైపుణ్యాల ప్రదర్శనకు డ్యూటీ మీట్ ఉత్తమ వేదిక - జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**
**జిల్లా స్థాయి 3వ పోలీస్ డ్యూటీ మీట్-2026 ప్రారంభించిన జిల్లా ఎస్పీ**

జగిత్యాల ప్రతినిధి జూన్ 22 (ప్రజా కలం)

పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల్లో మరింత సమర్థవంతంగా రాణించాలంటే వృత్తి నైపుణ్యం అత్యంత అవసరమని, నేర దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, కేసుల ఛేదన, ప్రజా భద్రత పరిరక్షణ వంటి అంశాల్లో నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న జిల్లా 3వ పోలీస్ డ్యూటీ మీట్-2026 కార్యక్రమాన్ని ఎస్పీ అశోక్ కుమార్ అదనపు ఎస్పి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు సిబ్బందిలో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు, ఆధునిక దర్యాప్తు పద్ధతులు, ఫోరెన్సిక్ సాంకేతికతలు, నేర పరిశో




ధనలో అనుసరించాల్సిన ఉత్తమ విధానాలపై అవగాహన పెంపొందించేందుకు డ్యూటీ మీట్ ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని అన్నారు. పోలీసు శాఖలో ప్రతి అధికారి, సిబ్బంది చట్టాలపై సంపూర్ణ అవగాహనతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. నేరస్థులను శాస్త్రీయ ఆధారాలతో న్యాయస్థానంలో దోషులుగా నిరూపించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. పోలీస్ డ్యూటీ మీట్ ద్వారా పోలీసు అధికారులు,సిబ్బంది తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు, అనుభవాలను పంచుకోవడానికి, వినూత్న ఆలోచనలను పరస్పరం మార్పిడి చేసుకునేందుకు చక్కటి వేదిక అని అన్నారు. ఈ డ్యూటీ మీట్‌లో కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్‌ప్రింట్స్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ ట్రాకింగ్, ఎక్స్‌ప్లోజివ్స్, యాంటీ-సబోటేజ్ చెకింగ్, కంప్యూటర్ అవగాహన, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని అదేవిధంగా జాతీయ స్థాయిలో నిర్వహించే పోలీస్ డ్యూటీ మీట్‌లో విజేతలకు విశేష గుర్తింపు లభిస్తుందని, రాష్ట్రాలు, ఇతర ప్రాంతాల పోలీసు అధికారుల మధ్య సమన్వయం, సహకారం, వృత్తిపరమైన అనుభవాల మార్పిడి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, ఐపీఎస్, డీఎస్పీపురుషోత్తం రెడ్డి, రాములు, ఇన్‌స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్, సుధాకర్, కరుణాకర్, రవి,లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్, వేణు,ఎస్‌ఐ లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

## - అడిషనల్ కలెక్టర్ బి.ఎస్. లతకు బీసీ విద్యార్థి సంఘం వినతి



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 22(ప్రజాకలం) ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల మౌలిక వసతుల కల్పన, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ తదితర అంశాలపై బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జెట్టి నరేంద్ర అడిషనల్ కలెక్టర్ బి.ఎస్. లతకు వినతిపత్రం అందజేశారు. మెట్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆయన కోరారు. డివిజన్‌లోని సుమారు 50 పాఠశాలల్లో శిథిలావస్థకు చేరుకున్న తరగతి గదులను కూల్చివేయాలని అధికారులు సూచించిన నేపథ్యంలో, కొన్ని గ్రామాల్లో విద్యార్థులకు చెట్ల కింద బోధన జరుగుతోందని పేర్కొన్నారు. వర్షాకాలం సమీపిస్తున్నందున తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు బోధన కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో "మన ఊరు - మన బడి" కార్యక్రమం కింద చేపట్టిన కొన్ని అభివృద్ధి పనులు నాణ్యత లోపంతో దెబ్బతిన్నాయని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పునరుద్ధరించాలని కోరారు. మెట్‌పల్లి పట్టణంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన విద్యాసంస్థల భవన నిర్మాణాలకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని సూచించారు. మరోవైపు, డివిజన్‌లోని పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలపై భారం మోపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఐఐటీ, నీట్, ట్రిపుల్ ఐటీ కోర్సుల పేరిట అదనపు ఫీజులు, నోట్‌బుక్స్ తదితర పేర్లతో భారీగా వసూళ్లు చేస్తున్న విద్యాసంస్థలపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు ఎండి ముక్తార్ భాయ్, దానవేని రాజ్‌కుమార్, వంశీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాలు సాధించాలి

**ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ సమీక్ష**
**జిల్లాలోని పాఠశాలలు, ఆరోగ్య కేంద్రం, ఇందిరమ్మ ఇళ్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన ప్రత్యేక కార్యదర్శి**
**రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్**



జగిత్యాల ప్రతినిధి జూన్ 22 (ప్రజా కలం) ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం అమలు పై ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి సోమవారం జగిత్యాల జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ పాఠశాలలో విద్యా ప్రమాణాలు, విద్యార్థుల హాజరు, బోధన విధానాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై జిల్లా విద్యాశాఖాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని పదవ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమైన రాబోయే పరీక్షల కోసం ఇప్పటి నుంచే లక్ష్యంతో కూడిన ప్రణాళిక రూపొందించుకుని కష్టపడి చదవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పట్టుదలతో శ్రమించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు పూర్తిగా అందాయా అని ఆరా తీశారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం అమలు, కోడిగుడ్ల సరఫరా, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు, బోధన నిర్వహణపై ప్రధానోపాధ్యాయులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్న ఆమె, గత సంవత్సర ఎస్ఎస్సి ఫలితాల పై జిల్లా విద్యాశాఖాధికారి నుండి సమాచారం సేకరించారు. అనంతరం పాఠశాలలోని డైనింగ్ హాల్, మధ్యాహ్న భోజన వంటశాలను పరిశీలించారు. ఎం.డీ.ఎం నిర్వాహకులతో మాట్లాడి ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం అందించాలని, పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తూ ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్వహణ చేపట్టాలని సూచించారు. పాఠశాల పరిసరాల్లో కిచెన్ గార్డెన్‌ను సక్రమంగా నిర్వహించాలని సూచించిన ఆమె, మధ్యాహ్న భోజన పథక నిర్వహణలో ఎల్పీజీ గ్యాస్ వినియోగంపై కూడా వివరాలు తెలుసుకున్నారు. చివరగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యను జీవితం లో అత్యంత విలువైన సంపదగా భావించి క్రమశిక్షణ తో చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది పనితీరు, ఆరోగ్య కేంద్రంలో ఉన్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు కొనసాగించాలని సూచించారు. తదుపరి మల్యాల మండలం సర్వాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న, పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ఇళ్ల నిర్మాణ పురోగతి, ప్రభుత్వం అందిస్తున్న 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం గురించి వివరాలు తెలుసుకున్నారు. పూర్తయిన ఇళ్లను సందర్శించి పరిశీలించి, ఇళ్లు ఎంతో నాణ్యంగా మరియు ఆకర్షణీయంగా నిర్మించబడినట్లు అభినందించారు. అలాగే నిర్మాణంలో ఉన్న ఇళ్ల పనులను కూడా నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కల సాకారం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జిల్లా విద్యాశాఖాధికారి కె. రాము, డిపిఓ మదన్మోహన్, స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రికాస్ట్ ప్రహరీ గోడ నిర్మాణానికి సర్వే



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 22 (ప్రజాకలం) పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రికాస్ట్ ద్వారా ప్రహరీ గోడ నిర్మాణానికి సర్వే చేసి నివేదికను సమర్పించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఇటీవల మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కు మౌఖిక సూచనలు ఇచ్చిన నేపథ్యంలో మెట్ పల్లి మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస గౌడ్ సహకారంతో కళాశాలలో మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కళాశాల ప్రిన్సిపాల్ కే.వేంకయ్య,కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తొంటి దేవన్నలతో పాటు స్థానిక మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది సృజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కళాశాలలో ఒక్కొక్క అడుగునకు 60 రూపాయల అంచనా వ్యయంతో మొత్తం 3488 అడుగుల పొడవుతో,6 అడుగుల ఎత్తుతో "ప్రికాస్ట్" ద్వారా ప్రహరీ గోడను నిర్మించటానికి దాదాపు 2 లక్షల 9 వేల 280 రూపాయల ఖర్చు అవుతుందని,దానికి సీనరేజ్ ఛార్జీలు, డీ ఎం ఎఫ్ టీ, ఎస్ ఎం ఈ టీ, పర్మిట్ ఫీజు వంటి అన్ని రకాల పన్నులు కలిపి మొత్తం 2 లక్షల 60 వేల రూపాయలు ఖర్చు అవుతుందని మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్ నాగేశ్వర్ రావు సమక్షంలో ఇంజనీరింగ్ సిబ్బంది అంచనా వేశారు. ఈ అంచనా వ్యయం కాపీని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమర్పించామని మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కే.వేంకయ్య తెలిపారు.సర్వేకు సహకరించిన మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రీకాస్ట్ తో నిర్మించనున్న ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి,విద్యార్థుల కష్టాలను తొలగించాలని కళాశాల ప్రిన్సిపాల్ జగిత్యాల జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.

# రాజకీయంగా ఎదుర్కోలేకే ఎమ్మెల్యేపై ఆరోపణలు

## - ఏఎంసి చైర్మన్ చేలుకల తిరుపతి

రుద్రంగి, జూన్ 22,(ప్రజాకలం ప్రతినిధి)

రాజకీయంగా ఎదుర్కోలేకె ఎంఎల్ఏ ఆది శ్రీనివాస్ పై ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేస్తున్నారని ఖండిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో ఏఎంసీ చెర్మెన్ చెలుకల తిరుపతి పత్రిక ప్రకటన విడుదల చేసారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తరఫున తెలంగాణ అసెంబ్లీలో ఎన్నికైన ఏకైక మున్నూరు కాపు ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై జరుగుతున్న అసత్య ప్రచారం అత్యంత ఖండనీయం. ప్రజల విశ్వాసాన్ని, రాజకీయ ప్రత్యర్థుల గౌరవాన్ని సైతం సంపాదించుకున్న నాయకుడిపై ఆధారాలు లేని ఆరోపణలు



చేయడం కొందరి రాజకీయ దివాళాకోరుతనాన్ని, నిరాశను బహిర్గతం చేస్తోందన్నారు. ఆది శ్రీనివాస్ రాజకీయంగా ఎదిగింది వారసత్వం వల్ల కాదు.. డబ్బు, అధికారం అండతో కాదు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన ఆయన కష్టపడి, ప్రజల మధ్య ఉంటూ, వారి సమస్యల కోసం పోరాడుతూ, తన నిజాయితీ, నిబద్ధతతో ఈ స్థాయికి చేరుకున్నారు. బీసీ వర్గాలకు చెందిన యువ నాయకుడిగా ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఇటీవల ధాన్యం అక్రమ రవాణా కేసు నేపథ్యంలో కొందరు ఉద్దేశపూర్వకంగా ఆది శ్రీనివాస్ పేరును లాగేందుకు ప్రయత్నించడం అత్యంత బాధ్యతారాహిత్యమైన చర్య అని, ఒక కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి సోదరుడు కాంగ్రెస్ నాయకుడు అనే కారణంతో రాష్ట్ర ప్రభుత్వ విప్‌ను ఆ కేసుతో ముడిపెట్టడం వాస్తవాలను వక్రీకరించడం మాత్రమే కాకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని, చట్టం ముందు ఎవరూ అతీతులు కారు. ఎవరైనా తప్పు చేసి ఉంటే చట్టం తన పని తాను చేసుకుపోతుందని, దర్యాప్తు సంస్థలు, న్యాయవ్యవస్థ తమ విధులను నిర్వర్తిస్తాయి. అయితే ఎటువంటి సంబంధం లేని వ్యక్తిని, ముఖ్యంగా ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న ఒక ప్రజాప్రతినిధిని రాజకీయ కుట్రల్లో భాగంగా లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రజల ఆదరణను, రాజకీయ ప్రాధాన్యతను తట్టుకోలేక కొందరు కావాలనే తప్పుడు కథనాలు సృష్టించి, సామాజిక మాధ్యమాలు మరియు కొన్ని వేదికల ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని, అసత్యాలు ఎంత పెద్దగా ప్రచారం చేసినా అవి ఎప్పటికీ సత్యాలుగా మారవని, వాస్తవాలు చివరకు గెలుస్తాయని అన్నారు. ఆది శ్రీనివాస్ రాజకీయ జీవితం పారదర్శకతకు, ప్రజా సేవకు నిదర్శనం. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న నాయకుడి ప్రతిష్టను దెబ్బతీయాలనే కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, ఇటువంటి నిరాధార ఆరోపణలు ఆయన ప్రజాదరణను ఏమాత్రం తగ్గించలేవని, పైగా ప్రజల్లో ఆయనపై ఉన్న విశ్వాసాన్ని మరింతబలపరుస్తాయని, ప్రజలు అన్నింటిని గమనిస్తున్నారని, నిజం ఎప్పటికైనా వెలుగులోకి వస్తుందని, ఆది శ్రీనివాస్‌పై జరుగుతున్న ఈ దుష్ప్రచారాన్ని ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, బీసీ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయని పేర్కొన్నారు.

# బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు

## - జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

## - గ్రీవెన్స్ డేలో ఫిర్యాదులను స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



జగిత్యాల ప్రతినిధి జూన్ 22 (ప్రజాకలం)

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రజల నుండి అందిన ఫిర్యాదులను స్వయంగా పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 17 మంది అర్జీదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా, పారదర్శకంగా విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.



ప్రజా కలం
మంగళవారం, జూన్ 23, 2026

# పరిమితులు అవసరమా?

ఇప్పుడు కృత్రిమ మేధస్సు (ఏఐ) రూపంలో ప్రారంభమైన కొత్త విప్లవం, మానవ నాగరికతను కొత్త దిశలో నడిపిస్తోంది. అయితే అదే సమయంలో ఒక కీలకమైన ప్రశ్నను కూడా ముందుకు తెస్తోంది. భూమిపై ఉన్న సరిహద్దులు సరిపోలేదన్నట్లు ఇకపై అత్యాధునిక సాంకేతికతలకు కూడా దేశాల వారీగా సరిహద్దులు ఏర్పడతాయా? ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చర్చకు కారణమైన ఆంథ్రోపిక్ వివాదం ఈ ప్రశ్నను మరింత బలంగా వినిపిస్తోంది. అత్యాధునిక ఏఐ మోడళ్లపై జాతీయ భద్రత, సైబర్ భద్రత పేరుతో ఆంక్షలు విధించాలనే ఆలోచన కేవలం ఒక సంస్థకు సంబంధించిన విషయం కాదు. ఇది భవిష్యత్తులో ప్రపంచం ఏఐని ఎలా చూడబోతోందో చెప్పే సంకేతం. ఒకప్పుడు చమురు ఎవరి వద్ద ఉందో వారే ప్రపంచ రాజకీయాలను ప్రభావితం చేశారు. ఆ తర్వాత అణు సాంకేతికత ప్రపంచ శక్తి సమీకరణాలను నిర్ణయించింది. ఇటీవల సెమీ కండక్టర్ చిప్స్‌పై ఆధిపత్యం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలకంగా మారింది. ఇప్పుడు అదే స్థానాన్ని కృత్రిమ మేధస్సు ఆక్రమిస్తోంది. ఏఐ ఇకపై ఒక సాధారణ సాఫ్ట్‌వేర్ కాదు. అది ఒక దేశ ఆర్థిక శక్తిని, సైనిక సామర్థ్యాన్ని, పరిశోధన వేగాన్ని, సైబర్ భద్రతను, అంతర్జాతీయ ప్రభావాన్ని నిర్ణయించే వ్యూహాత్మక ఆస్తిగా మారుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ ప్రభుత్వాలు ఏఐని కేవలం మార్కెట్ ఉత్పత్తిగా కాకుండా జాతీయ భద్రతా సాధనంగా చూడటం ప్రారంభించాయి. దీనిలో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే నేటి ఫ్రంటియర్ ఏఐ మోడళ్లు కేవలం సంభాషణలు చేసే చాట్‌బాట్లు కావు. అవి లక్షల పేజీల సమాచారాన్ని విశ్లేషిస్తాయి. క్లిష్టమైన శాస్త్రీయ పరిశోధనలకు సహకరిస్తాయి. సాఫ్ట్‌వేర్ కోడ్‌ను రాస్తాయి. వైద్య రంగం నుంచి రక్షణ రంగం వరకు అనేక వ్యవస్థల పనితీరును ప్రభావితం చేస్తాయి. ఈ సామర్థ్యాలే వాటిని అసాధారణంగా, శక్తిమంతంగా మారుస్తున్నాయి. ఇక్కడే ఒక పెద్ద ప్రశ్న తలెత్తుతోంది. ఇంతటి శక్తి కలిగిన సాంకేతికత పూర్తిగా అందరికీ అందుబాటులో ఉండాలా? లేక కొన్ని పరిమితులు అవసరమా? చరిత్ర చెబుతున్న ఒక వాస్తవం ఏమిటంటే... అపార శక్తి ఉన్న ప్రతి సాంకేతికత చివరకు నియంత్రణల పరిధిలోకి వచ్చింది. అణుశక్తి అందరికీ అందుబాటులో లేదు. అత్యాధునిక ఆయుధ సాంకేతికతలపై ఆంక్షలు ఉన్నాయి. సూపర్ కంప్యూటర్ల ఎగుమతులపై కూడా ఎన్నో దేశాలు పరిమితులు విధించాయి. ఇప్పుడు అదే తర్కం ఏఐ విషయంలో వినిపిస్తోంది. అయితే ఏఐ పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంది. ఎందుకంటే అణు సాంకేతికత కొద్ది దేశాలకు మాత్రమే పరిమితం. కానీ ఏఐ మాత్రం ప్రపంచవ్యాప్తంగా లక్షలాది పరిశోధకుల, డెవలపర్ల, విద్యార్థుల సహకారంతో అభివృద్ధి చెందుతోంది. దీనిపై అతిగా నియంత్రణలు విధిస్తే ఆవిష్కరణలు మందగించే ప్రమాదం ఉంది. జ్ఞానం కొద్ది దేశాల చేతుల్లోనే కేంద్రీకృతమయ్యే అవకాశం ఉంది. ఫలితంగా సాంకేతిక అసమానతలు మరింత పెరగవచ్చు. అంతేకాదు, ఏఐపై ఆంక్షలు విధించడం ద్వారా ప్రపంచం కొత్త తరహా డిజిటల్ శీతల యుద్ధంలోకి ప్రవేశించే ప్రమాదం కూడా ఉంది. ఒకవైపు అమెరికా, మరోవైపు చైనా, మధ్యలో యూరప్, ఇతర దేశాలు తమ ఏఐ పర్యావరణ వ్యవస్థలను నిర్మించుకునే దిశగా వెళితే ఇంటర్నెట్ యుగంలో మనం చూసిన ఓపెన్ గ్లోబల్ సహకారం క్రమంగా తగ్గిపోవచ్చు. భవిష్యత్తులో ఒక దేశంలో అందుబాటులో ఉన్న ఏఐ మరో దేశంలో నిషేధించే పరిస్థితులు కూడా రావచ్చు. ఈ నేపథ్యంలో భారతదేశం పాత్ర అత్యంత కీలకంగా మారుతోంది. ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా, అత్యంత వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, అపారమైన సాఫ్ట్‌వేర్ ప్రతిభ, విభిన్న భాషా సంపద... ఇవన్నీ భారతదేశానికి ప్రత్యేక బలం. కానీ ఈ బలం కేవలం వినియోగదారుల సంఖ్యకే పరిమితమైతే ప్రయోజనం ఉండదు. భవిష్యత్తులో ఏఐ ఆధిపత్యం ప్రపంచ రాజకీయాలను నిర్ణయించే స్థాయికి చేరుకుంటే, ఇతర దేశాల మోడళ్లను ఉపయోగించే దేశంగా కాకుండా సొంత సాంకేతిక సామర్థ్యాన్ని నిర్మించుకున్న దేశంగా భారత్ నిలవాలి. అందుకే ఇండియా ఏఐ మిషన్, స్వదేశీ లార్జ్ లాంగ్వేజ్ మోడళ్లు, దేశీయ డేటా సెంటర్లు, అధునాతన కంప్యూటింగ్ మౌలిక వసతులు, చిప్ తయారీ సామర్థ్యాలు, భారతీయ భాషల కోసం ప్రత్యేక ఏఐ వ్యవస్థల అభివృద్ధి అత్యవసరంగా మారాయి. ఇది కేవలం సాంకేతిక అభివృద్ధి కోసం కాదు. భవిష్యత్తు డిజిటల్ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడానికి కూా అవసరం. అయితే ప్రపంచం ముందు ఉన్న అసలు సవాలు మరొకటి. భద్రత పేరుతో ఆవిష్కరణలను అణచివేయకూడదు. అదే సమయంలో స్వేచ్ఛ పేరుతో ప్రమాదాలను కూడా నిర్లక్ష్యం చేయకూడదు. ఈ రెండింటి మధ్య సమతుల్యతను కనుగొనడమే రాబోయే దశాబ్దంలో ప్రపంచ ప్రభుత్వాల ముందున్న అతిపెద్ద సవాలు. ఆంథ్రోపిక్ వివాదం త్వరలో ముగిసిపోవచ్చు. ఆంక్షలు ఎత్తివేయవచ్చు. కానీ, ఈ సంఘటన ప్రపంచానికి ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది. కృత్రిమ మేధస్సు ఇకపై కేవలం ఒక సాంకేతిక ఉత్పత్తి కాదు. అది భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థలను, జాతీయ భద్రతను, అంతర్జాతీయ శక్తి సమీకరణాలను, దేశాల ప్రభావాన్ని నిర్ణయించే వ్యూహాత్మక సాధనం. అందుకే రేపటి ప్రపంచంలో అత్యంత ముఖ్యమైన ప్రశ్న 'ఎవరి వద్ద అత్యంత తెలివైన ఏఐ ఉంది?' అనేది కాకపోవచ్చు. 'ఆ ఏఐని నియంత్రించే శక్తి ఎవరి చేతుల్లో ఉంది?' అన్నదే కావచ్చు. ప్రపంచం ఇప్పుడు ఒక కొత్త యుగం ద్వారం వద్ద నిలబడి ఉంది. ఆ యుగంలో దేశాల మధ్య సరిహద్దులు కేవలం భూమిపైనే కాదు... డేటాలో, చిప్స్‌లో, ఆల్గోరిథమ్‌లలో, కృత్రిమ మేధస్సులో కూడా కనిపించే అవకాశం ఉంది.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### – పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా అదనపు కలెక్టర్లు బి. ఎస్ లత, బి. రాజా గౌడ్



జగిత్యాల ప్రతినిధి జూన్ 22 (ప్రజాకలం) ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత అదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్ తో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ బి. ఎస్ లత మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 113 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇదివరకు ప్రజావాణి లో వచ్చిన 182 పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని లేని యెడల సంబంధిత జిల్లా అధికారి బాధ్యునిగా చేస్తూ మెమో జారీ చేయబడునని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం పై విమర్శలు చేయడం మానుకోవాలి

### – విద్యాసంస్థల అవినీతిని కప్పిపుచ్చుకున్నందుకే విమర్శలు
### – బీసీ యువజన సంఘం నాయకులు మాదాసు సంజీవ్

ధర్మారం, జూన్ 22 : ( ప్రజా కలం ప్రతినిధి )

అధికార పార్టీకి చెందిన ప్రైవేట్ విద్యా సంస్థల చైర్మన్ ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నీట్ పరీక్షలలో అవకతవకలు జరుగాయని దానికి బాధ్యులైన కేంద్ర మంత్రి పై విమర్శలు చేసిన ఆ చైర్మన్ కు కరీంనగర్ నిజామాబాద్, హైదరాబాద్, అదిలాబాద్, వరంగల్ జిల్లాలలో అనేక విద్యా సంస్థలు ఉన్నవి అలాంటి విద్యా సంస్థల లో విద్యార్థుల కు ఎంత ఫీజులు వసూలు చేస్తున్నారు అలాగే విద్యార్థు లను తల్లిదండ్రులను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు మరి దానిని ఎందుకు బహిర్గతం చేయ లేదని సోమవారం రోజున కరీంనగర్ లో బీసీ సంఘాల కార్యాలయం లో బీసీ సంఘాల సమావేశం లో జిల్లా యువజన సంఘం నాయకులు మాదాసు సంజీవ్ అన్నారు. ఈ సందర్భంగా మాదాసు సంజీవ్ మాట్లాడుతూ ఈ అధికార పార్టీకి చెందిన చైర్మన్ యొక్క టెక్నో పాఠశాలలో కేవలం అడ్మిషన్ ఫీజు 25 వేల రూపాయలు వసూలు చేస్తున్నారు అలాగే ఇతర పాఠశాలలో ఇతర కళాశాలలో లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు ఇలా పేద విద్యార్థులను తల్లి దండ్రులను దోచుకుంటున్న ఆ విద్యాసంస్థల చైర్మన్ నీట్ పరీక్ష పై మాట్లాడడం విడ్డూరం విద్యాసంస్థల చైర్మన్ గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల లో పోటీ చేసినారు విద్యార్థులు తల్లిదండ్రులు నిరుద్యోగులు అందరు కలిసి గెలిపివ్వలేదు ఇలా ఇక్కడ కాకుండా వరంగల్ జిల్లాలో కూడా అక్కడ విద్యా సంస్థ చైర్మన్ కూడా అక్కడ నిరుద్యోగులు, విద్యార్థులు తల్లిదండ్రులు కూడా గెలి పించలేదు ఇలా విద్యా సంస్థల చైర్మన్ లకు రాజకీయాలకు అవకాశాలు ఇవ్వకూడదు విద్యార్థులను తల్లిదండ్రులను పట్టిపీడించే విద్యాసంస్థల చైర్మన్ లకు ఎలాంటి పదవి ఇచ్చినా ఆ పార్టీకే నష్టం ఇలాంటి వారిని రాజకీయాలకు దూరంగా ఉంచాలని బీసీ సంఘాల పక్షానకోరారు గతం లో ఎలక్షన్లో పోటీ చేసిన అనంతరం



ఆ యొక్క ఖర్చును విద్యార్థులను తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టుకుంటూ ఏకంగా వేలాది రూపాయల ఫీజులను పెంచడం జరిగింది ఇలా తల్లిదండ్రులను విద్యార్థుల ను ఇబ్బంది పెడుతున్న ఈ విద్యాసంస్థల యాజమాన్యం పై విద్యార్థులు తల్లిదండ్రులు అడగాలని సమావేశం కోరింది అలాగే కేంద్ర ప్రభుత్వం పై విమర్శ చేసిన ఈ అధికార పార్టీకి చెందిన విద్యా సంస్థల చైర్మన్ యొక్క పాఠశాలల ఫీజుల పై కళాశాల ఫీజులపై అక్రమ వసూళ్ల పై కేంద్ర మంత్రులు దృష్టి పెట్టాలని సమావేశం కోరింది. ఈ అధికార పార్టీకి చెందిన విద్యా సంస్థల చైర్మన్ ప్రభుత్వ వాహనాన్ని ఉపయోగించుకొని తన భవన నిర్మాణానికి నిర్మాణ సామగ్రిని తెచ్చుకున్న విషయం బహిరంగమైంది దీనిపై ఎలాంటి విచారణ జరగలేదు. అలాగే ఈ విద్యా సంస్థలకు సంబంధించిన దాని పై త్వరలో ఇన్కమ్ టాక్స్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నామని పేద విద్యార్థుల సొమ్మును పేద విద్యార్థులకు అందించేంత వరకు బలహీన వర్గాలను కలుపుకొని ఉద్య మిస్తామని సమావేశం హెచ్చరించింది. ఈ కార్యక్రమం లో బీసీ సంక్షేమ, అనుబంధ సంఘాల నాయకులు ఎడ్ల సురేందర్, దుప్పటపల్లి మురళి, వాయిల రాజ్ కుమార్, చింటూ పటేల్ పోకల విజయ్, సాయి కుమార్, చిట్టీమల్ల సాగర్, నరేష్, పూజిత, సరిత, లావణ్య, సంధ్య తదితరులు పాల్గొన్నట్లు బీసీ యువజన సంఘం నాయకులు మాదాసు సంజీవ్ తెలిపారు.

## అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి


### -జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి,జూన్ 22:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష,అదనపు కలెక్టర్ కొప్పుల వెంకటరెడ్డి,డిఆర్ఓ రాజేశ్వరి లతో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట గ్రామానికి చెందిన నోముల రాజేశ్వర్ రెడ్డి తమ ఇంటిని ఆన్లైన్లో నమోదు చేసేందుకు దరఖాస్తు చేసుకోగా పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని,తమ పేరు నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఎంపిడిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.రామగుండం గౌతమినగర్ కు చెందిన డి కాశయ్య మల్కాపురం గ్రామంలో సర్వేనెంబర్ 125/3 లో గల 20 ఎకరాల భూమి గతంలో ఎక్స్ సర్వీస్ మెన్ కోసం 1981లో కేటాయించడం జరిగిందని,దీనిలో ఎటువంటి ప్రభుత్వ భవనాల నిర్మాణానికి అనుమతి ఇవ్వరాదని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఆర్డీవో పెద్దపల్లి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఓదెల మండలం గూడెం గ్రామానికి చెందిన వేముల నర్సమ్మ సర్వే నెంబర్ 474/1 లో ఎకరం భూమి ఉందని,తన భూమిని కొంతమంది ఆక్రమించాలని చూస్తున్నారని,తన భూమి జోలికి ఎవరు రాకుండా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ ఓదెల కు రాస్తూ నిబంధనలు ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గోదావరిఖని సూర్య నగర్ కు చెందిన ఆర్.రాధ తన కుమారుడికి ప్రభుత్వ విద్యా సంస్థలోని హాస్టల్లో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా విద్యాశాఖ అధికారికి రాసన్తూ తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## సహాయ నిధి చెక్కు అందజేత



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 22 (ప్రజాకలం) టీపీసీసీ డెలిగేట్ సుజిత్ రావు ఆదేశాల మేరకు మెట్‌పల్లి మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన కంఠం రూప (పురుషోత్తం)కు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కును మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన పేద ప్రజలకు సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. అవసరమైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి అందే మారుతి, మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఖుతుబుద్దీన్ పాషా, కూన సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

## మెట్‌పల్లి ఎంపీడీఓగా మహేందర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 22 (ప్రజా కలం) మెట్‌పల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా (ఎంపీడీఓ) వి. మహేందర్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన మోత్కుకూరి సురేష్ బదిలీపై సిద్దిపేట జిల్లా వర్గల్ మండలానికి వెళ్లారు. సురేష్ బదిలీ అనంతరం కోరుట్ల ఎంపీడీఓ వొడెల రామకృష్ణ మెట్‌పల్లి ఇన్‌చార్జి ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. తాజాగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు వి. మహేందర్ రెడ్డి పూర్తి స్థాయి ఎంపీడీఓగా నియమితులై బాధ్యతలు చేపట్టారు. మహేందర్ రెడ్డి గతంలో ధర్మపురి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీవోగా విధులు నిర్వర్తించారు. అనంతరం పదోన్నతి పొంది మెట్‌పల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.




## వాసవి అమ్మ వారికి ప్రత్యేక పూజలు



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్: 22 జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని జవహర్ రోడ్ గల వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ పునః ప్రతిష్ఠ జరిగి సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా 22 వ తేదీ నుండి 24 వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆర్య వైశ్య సంఘ అధ్యక్షులు పడిగేల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమాల్లో మొదటి రోజు సహస్ర కలశ స్థాపనలో భాగంగా మహిళలు జవహర్ రోడ్ లోని ఆంజనేయ స్వామి ఆలయం నుండి ప్రత్యేకించి పూజించిన కలశాలను నెత్తిన పెట్టుకొని భక్తి శ్రద్ధలతో మేళ తాళాల మధ్య ఊరేగింపుగా వాసవి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అర్చకులు అమ్మవారికి హారతి సమర్పించారు. కార్యక్రమాల్లో భాగంగా ఆలయ అర్చకులు పాలేపు రాము శర్మ వైదిక నిర్వహణలో భాగంగా గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, కలశ స్థాపన, సహస్ర కలశ స్థాపన కార్యక్రమం ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు పడిగేల పవన్, సంఘ అధ్యక్షులు పడిగేల శ్రీనివాస్, కార్యదర్శి ఎలిమి బుచ్చన్న, కోశాధికారి చౌదరి సూర్యకాంత్, మహిళా అధ్యక్షురాలు, బూస మాధురి, మాజీ అధ్యక్షులు నీలి కాశీనాథ్, కోటగిరి ప్రసాద్, పిఆర్ఓ బట్టు హరికృష్ణ, వాసవి క్లబ్ సీనియర్ సిటిజెన్ అధ్యక్షులు కొత్త గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎడమల ఎల్లారెడ్డి జ్ఞాపకార్థంగా విద్యార్థులకు స్కాలర్ షిప్ అందజేత

గొల్లపల్లి జూన్ 22 ప్రజాకలం ప్రతినిధి

గొల్లపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ లో సోమవారం ఎడమల ఎల్లారెడ్డి జ్ఞాపకార్థంగా వారి కుమారులు ఎడమల భోజేందర్ రెడ్డి పదవ తరగతిలో ప్రథమ స్థానం సాధించినా చిర్ర వైష్ణవికి15 వేల రూపాయలు,ద్వితీయ స్థానం సాధించిన బండారు కీర్తి 10 వేల రూపాయలు తృతీయ స్థానం సాధించిన రంగు రసజ్ఞ లకు 5వేల రూపాయలు నగదును ప్రోత్సాహకంగా విద్యార్థులకు అందించారు.అనంతరం మల్లన్నపేట్ పాఠశాలలో ప్రథమ స్థానం సాధించిన పడాల అక్షయ పది వేల రూపాయలు,ద్వితీయ స్థానం సాధించిన మామిడిపేల్లి సాహిత్య ఐదు వేల రూపాయలను అందించారు. ఈ విద్యాసంవత్సరం కూడా విద్యార్థులకు స్కాలర్షిప్ ను యథావిధిగా కొనసాగుతుందని భోజేందర్ రెడ్డి అన్నారు.వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకొని మంచి మార్కులు సాధించాలని పాఠశాలకు ,తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఉన్నత స్థాయిలో నిలవాలని అన్నారు.ఈ కార్యక్రమం లో యూత్ నాయకులు అవారి చందు,శంకర్ రావు పేట ఉప సర్పంచ్ గుర్రం రంజిత్ రెడ్డి,గోలి రమేష్ ప్రిన్సిపాల్ సుంకరి రవి ,కళ్యం కిషోర్ కుమార్, మల్లన్నపేట్ గ్రామ సర్పంచ్ సిద్దెంకి లక్ష్మీ మల్లారెడ్డి ,శంకర్ రావు పెట్ సర్పంచ్ గోలి గంగారెడ్డి వెంగళాపూర్ సర్పంచ్ రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం...



మల్లాపూర్, జూన్ 22( ప్రజా కలం ప్రతినిధి) మల్లాపూర్ మండలంలోని పాత ధర్మారాజ్ పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల వేతనాలను వారి ఖాతాల్లో జమ చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క, కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జువ్వాడి నర్సింగ రావు కు కృతజ్ఞతలు తెలుపుతూ సర్పంచుల మండల ఫోరం అధ్యక్షులు రోడ్డ రాజేశ్వరి రాజారెడ్డి ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగెం శ్రీరాంపూర్ గ్రామ సర్పంచ్ కిరణ్, నాయకులు కిరణ్ ,గడ్డం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజులు కట్టినా టీసీ కోసం దోపిడీ

## టీఎన్ఎస్ఎఫ్ పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు ఎండి వాజిద్

పెద్దపల్లి,జూన్ 22:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) పెద్దపల్లి జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు,జూనియర్ మరియు డిగ్రీ కళాశాల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాయని తెలుగునాడు విద్యార్థి ఫెడరేషన్ పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు ఎండి వాజిద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విద్యార్థులు ఏడాది పొడవునా ఫీజులు చెల్లించినప్పటికీ,చదువు పూర్తి చేసుకున్న తర్వాత బదిలీ ధ్రువపత్రం కావాలంటే రూ. 2వేలు నుంచి రూ.2,500 వరకు భారీగా డిమాండ్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు.టీసీ ఇవ్వడం అనేది విద్యార్థి ప్రాథమిక హక్కు అని,దానికి ఎటువంటి రుసుము వసూలు చేయకూడదనే స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని వాజిద్ గుర్తు చేశారు.యాజమాన్యాలు ఏమాత్రం భయం లేకుండా ఈ దందాను కొనసాగిస్తుంటే,విద్యాశాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అధికారులకు అన్నీ తెలిసినా పట్టించుకోకపోవడానికి కారణం ఏమిటని,వారికి ముడుపులు అందుతున్నాయని ఆయన నిలదీశారు. ఈ అక్రమ వసూళ్లపై తక్షణమే విద్యాశాఖ అధికారులు స్పందించాలని,జిల్లాలోని అన్ని ప్రైవేట్ విద్యాసంస్థల్లో తనిఖీలు చేపట్టాలని టీఎన్ఎస్ఎఫ్ డిమాండ్ చేసింది.ఎలాంటి రుసుము లేకుండానే టీసీలు అందజేయాలని సంబంధిత యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని,దీనిపై పత్రికా ప్రకటన ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ఒకవేళ ఇప్పటికైనా యాజమాన్యాలు తీరు మార్చుకోకపోతే,ఆయా విద్యాసంస్థల ముందు భారీ స్థాయిలో ధర్నా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెమ్మ సతీష్,వెంకటేష్,రాజు,నారీ తదితరులు పాల్గొన్నారు.




# సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం..



మల్లాపూర్, జూన్ 22 ( ప్రజా కలం ప్రతినిధి) మల్లాపూర్ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఎదురుగా రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు ఎల్లాల జలపతి రెడ్డి ప్రారంభించారు. జువ్వాడి నర్సింగ రావు సహకారంతో మెయిన్ రోడ్డు నుంచి దేవస్థానం మెట్ల వరకు ఈ సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. మల్లాపూర్‌లో సీసీ రోడ్డు, డ్రైనేజీ అభివృద్ధి కోసం రూ.67 లక్షల నిధులు మంజూరు చేయించిన జువ్వాడి నర్సింగ రావు కు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, ఉప సర్పంచ్ గడ్డం సోమారెడ్డి, దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సంగ రాజం యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాట్ల సోమయ్య, వన సంరక్షణ సమితి మాజీ చైర్మన్ సిరిపురం రవీందర్, కోటగిరి ఆనంద్ గౌడ్, మరిపెల్లి మల్లయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నూతిపెల్లి రాజం తదితరులు పాల్గొన్నారు.

# చిట్టాపూర్ ఊరకుంట కబ్జాలపై ఆర్డీవో కు వినతిపత్రం

మల్లాపూర్ జూన్ 22 ( ప్రజా కలం ప్రతినిధి) మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామ గంగపుత్ర సంఘ సభ్యులు గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 277లో ఉన్న 18 ఎకరాల ఊరకుంట భూమి కబ్జాలకు గురవుతోందని పేర్కొంటూ మెట్‌పల్లి ఆర్డీవో కు వినతిపత్రం అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా చుట్టుపక్కల రైతుల ఆక్రమణల వల్ల చెరువు విస్తీర్ణం తగ్గిపోతుండడంతో పాటు నీటి ఒత్తిడి కారణంగా చెరువు కట్ట, తూము దెబ్బతిన్నాయని తెలిపారు. గతంలో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో సర్వే నిర్వహిస్తామని అధికారులు నోటీసు ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు సర్వే పూర్తి కాలేదని పేర్కొన్నారు. తక్షణమే సర్వే నిర్వహించి అక్రమ కబ్జాలను తొలగించి చెరువును పరిరక్షించాలని వారు కోరారు.



# అంతర్ జిల్లా బైక్ దొంగ అరెస్ట్

## నిందితుడి నుంచి వాహనం స్వాధీనం - పెద్దపల్లి పట్టణ ఎస్ఐ కె.నరేష్

పెద్దపల్లి,జూన్ 22:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి పట్టణంలో వరుసగా వాహన చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగను పోలీసులు అరెస్టు చేశారు.నిందితుడి నుంచి దొంగిలించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పెద్దపల్లి పట్టణ ఎస్ఐ కె.నరేష్ సోమవారం మీడియాకు వివరాలు వెల్లడించారు.ఎస్ఐ కె.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం..పెద్దపల్లి పట్టణంలోని పాత బజార్‌కు చెందిన తమ్మిశెట్టి రవీందర్ తన స్ప్లెండర్ ప్లస్ బైక్‌ను ఈ నెల19న శివాలయం వీధిలో పార్క్ చేయగా,గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు.బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామని ఎస్ఐ తెలిపారు.ఈ క్రమంలోనే సోమవారం మంథని ప్లై ఓవర్ వద్ద తాము వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా,బెజ్జూర్ మండలం మర్రిడి గ్రామానికి చెందిన బోర్కుటి సంజీవ్ అనుమానాస్పదంగా బైక్‌పై వెళ్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడని వివరించారు.పోలీసులు అతడిని వెంబడించి పట్టుకోగా,విచారణలో అతను దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించాడని చెప్పారు.నిందితుడు సంజీవ్‌పై గతంలోనే బెజ్జూర్,సిర్పూర్ కాగజ్‌నగర్, సిరిసిల్ల, కరీంనగర్ ప్రాంతాల్లో పలు దొంగతనాల కేసులు ఉన్నాయని,జైలు శిక్ష కూడా అనుభవించాడని ఎస్ఐ



పేర్కొన్నారు. నిందితుడి వద్ద నుండి దొంగిలించిన వాహనాన్ని స్వాధీనం చేసుకుని,రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన ఎస్ఐ కె.నరేష్, కానిస్టేబుళ్లు ప్రభాకర్,సతీష్‌లను ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.ప్రజలు తమ వాహనాలను పార్క్ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

# అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం




## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,జూన్ 22:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు జిల్లా యంత్రాంగం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఐసీడీఎస్ రామగుండం ప్రాజెక్టులో 4, పెద్దపల్లి ప్రాజెక్టులో 17,మంథని ప్రాజెక్టులో 43 పోస్టులు కలిపి మొత్తం 64 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.అర్హత కలిగిన స్థానిక మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే స్వీకరించబడతాయని కలెక్టర్ స్పష్టం చేశారు.అభ్యర్థులు సంబంధిత అంగన్‌వాడీ కేంద్రం ఉన్న గ్రామం లేదా మున్సిపల్ వార్డుకు చెందిన వారై ఉండాలని,ఇంటర్‌మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. జులై 1-2026 నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్న ఆయన,వినికిడి యంత్రాల సహాయంతో వినగలిగే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు https://mis.tgwdcw.nic.in వెబ్‌సైట్ ద్వారా జూలై 6, 2026 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు సమర్పించవచ్చు. దరఖాస్తుతో పాటు ఎస్ఎస్‌సీ మెమో,జనన ధృవీకరణ పత్రం, నివాస ధృవీకరణ పత్రం,ఇంటర్‌మీడియట్ సర్టిఫికేట్, దివ్యాంగుల సదరం సర్టిఫికేట్, కుల ధృవీకరణ పత్రం మరియు అనాథ ధృవీకరణ పత్రం వంటి అవసరమైన పత్రాలను జతపరచాలని కోరారు.ప్రజావాణి లేదా కార్యాలయాల్లో నేరుగా ఇచ్చే దరఖాస్తులు స్వీకరించబడవని,కేవలం ఆన్‌లైన్ దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయబడతాయని, నియామక ప్రక్రియను ఏ దశలోనైనా రద్దు చేసే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఉంటుందని ప్రకటనలో తెలిపారు.

# చోరీ కేసులో నిందితుడికి 3 నెలల జైలు శిక్ష

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 22 (ప్రజాకలం) మెట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంపేట హనుమాన్ ఆలయంలో జరిగిన చోరీ కేసులో నిందితుడు కమ్మరపల్లికి చెందిన ఎస్.కె. హైదర్ వ్యక్తికి 3 నెలల జైలు శిక్ష విధిస్తూ మెట్‌పల్లి జూనియర్ సివిల్ జడ్జి-కమ్-జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వి. మాధవి తీర్పు వెలువరించారు. పోలీసుల వివరాల ప్రకారం, వెంపేట హనుమాన్ ఆలయ పూజారి భాను 2026 ఏప్రిల్ 7న మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏప్రిల్ 6 రాత్రి ఆలయాన్ని మూసివేసి ఇంటికి వెళ్లిన అనంతరం, మరుసటి రోజు ఉదయం ఆలయానికి వచ్చి చూడగా హుండీతో పాటు ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టబడినట్లు గుర్తించారు.ఈ ఘటనలో సుమారు రూ.2 వేల విలువైన నగదు, వస్తువులు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మెట్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టి, నిందితుడు ఎస్.కె. హైదర్‌ను గుర్తించి అరెస్టు చేశారు.అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయస్థానం సమర్పించిన ఆధారాలను పరిశీలించి నిందితుడిని దోషిగా తేల్చి మూడు నెలల జైలు శిక్ష విధించింది. ఈ కేసు దర్యాప్తు, నేర నిరూపణలో కృషి చేసిన పోలీసు అధికారులను ఉన్నతాధికారులు అభినందించారు.

# కోనరావుపేట గ్రామంలో పలు సీసీ రోడ్లకు మహర్దశ

## రూ. 10 లక్షల నిధులతో పనులకు భూమిపూజ చేసిన సర్పంచ్ మారు గంగారెడ్డి



మెట్ పల్లి రూరల్,జూన్ 22:(ప్రజా కలం):, మండల పరిధిలోని కోనరావుపేట గ్రామంలో అంతర్గత రహదారుల అభివృద్ధికి మహర్దశ పట్టింది. గ్రామంలో పలు సీసీ రోడ్ల నిర్మాణానికి వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు రూ. 10 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో చేపట్టనున్న పలు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం సర్పంచ్ మారు గంగారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు భూమిపూజ చేసి, కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించారు. గ్రామ అభివృద్ధికి పెద్దపీట వేస్తూ నిధులు మంజూరు చేయించినందుకు గాను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు జువ్వాడి నర్సింగరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో గ్రామాన్ని అన్ని రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జక్కని పరందములు, గ్రామ కార్యదర్శి రాణా ప్రతాప్, వార్డు సభ్యులు, గ్రామ కారోబార్ పుల్ల శ్రీనివాస్ గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ ముదం శ్రీను, పెంట ప్రవీణ్, అనిరెడ్డి మారుతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : సర్పంచ్ పుల్ల జగన్

## - జగ్గసాగర్ పాఠశాలలో ఘనంగా అక్షరాభ్యాస కార్యక్రమం, ఉచిత పుస్తకాల పంపిణీ

మెట్‌పల్లి రూరల్,జూన్ 22:(ప్రజా కలం):, ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు అత్యంత నాణ్యమైన విద్య లభిస్తుందని జగ్గసాగర్ గ్రామ సర్పంచ్ పుల్ల జగన్ అన్నారు. మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం నూతనంగా చేరిన విద్యార్థులకు సర్పంచ్ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుల్ల జగన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే బోధన సాగుతుందని, ప్రైవేటుకు దీటుగా విద్యా ప్రమాణాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు,



యూనిఫారాలు, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. అక్షరాభ్యాస కార్యక్రమం అనంతరం పాఠశాలకు వచ్చిన నూతన పాత విద్యార్థులకు సర్పంచ్ చేతుల మీదుగా ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.ఈ విద్యాభ్యాస, పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయ బృందం లక్ష్మణ్, మధుర, తేజ, లక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులను ఇరకాటంలో పెట్టనున్న ప్రభుత్వం

## - వెల్గటూర్ ఏఎంసీ మాజీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్

వెల్గటూర్, జూన్ 22 : ( ప్రజా కలం ప్రతినిధి )

గతంలో 33 రకాల సన్నపు వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు కేవలం ఏడు రకాలకు మాత్రమే బోనస్ ఇస్తామని తెలంగాణ రైతుల ను వ్యవసాయం చేయకుండ అడ్డుకుంటుందని రైతులు ఈ బాధను వ్యక్తం చేస్తు న్నారు. ఇప్పటికి రైతుబంధు పలు సార్లు పెండింగ్ పెట్టి కేవలం రెండు ఏకరాలకే వెయ్యడం జరిగింది ఇప్పుడు మళ్లీ అదేపద్ధతి కొనసాగి స్తోంది. రైతు భీమా ప్రిమియం చెల్లించలేదు రైతు బీమా చనిపోయిన రైతులకు అందడం లేదు కొత్తగా యూరియ యాప్ తో స్మార్ట్ ఫోన్ లు లేక ప్రీటింగ్ రాక ఫోన్ తో రైతులు ఇబ్బందు లు పడుతున్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగా రైతు బంధు ఒక్కసారి వేయాలి అలగే రైతు భీమా ప్రీమియం బీమా చెల్లించాలి యూరియ యాప్ ఎత్తి వేయాలి 33 రాకల సన్నపు వడ్లకు బోనస్ అందించాలి దొడ్డు వడ్లు పండించటానికి సహకరించాలి లేదా ముందే సరికొత్త ప్రాణాలిక తయారు చేయాలి. ఇప్పటికే వర్షాలు సరిగ్గా లేక రైతులు ఇబ్బంధి పడుతుంటే ఈ కొత్త నిర్ణ యంతో రైతులు సతమత మవుతున్నారు. అందుకే ముందు చూపు లేని నిర్ణయం రైతులకు భారం కాకుండా మేలు చేసే నిర్ణయం తీసుకోని రైతుల ను బ్రతుకించే పథకాలను తీసుకురావాలి. లేదా వ్యవసాయం పండగ కాదు దండగ అవుతుందని వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్ విజ్ఞప్తి చేశారు.

# పద్మశాలి ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

## - ఈనెల 26న చలో హైదరాబాద్ సదస్సు

## - రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పెద్దపల్లి,జూన్ 22:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26న హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ స్వకులశాలి సమాజ భవనంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సును దిగ్విజయం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఈగ వేంకటేశ్వర్లు రూపొందించిన చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్లను సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు.అనంతరం పెద్దపల్లి జిల్లా టిపియుఎస్ అధ్యక్షులు కొలిపాక సారయ్య మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలతో పాటు సింగరేణి,ఎన్టీపీసీ,అల్ట్రాటెక్, ఆర్టీసీ,ఎన్పిడిసిఎల్,జాతీయ బ్యాంకులు,ఎల్ఐసి వంటి పబ్లిక్ సెక్టార్ సంస్థల్లో పనిచేస్తున్న పద్మశాలి ఉద్యోగులందరూ పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.ఈ సదస్సులో సంఘం ద్వారా చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలపై సమీక్షించడంతో పాటు,ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు మరియు భవిష్యత్ కార్యాచరణపై లోతుగా చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ అసోసియేట్ ప్రెసిడెంట్ గౌడ ఆంజనేయులు,ఉపాధ్యక్షులు తాటికొండ శంకర్,ప్రచార కార్యదర్శి పెండెం సత్యనారాయణ,ప్రాథమిక సభ్యులు ఆడెపు రవికుమార్,బండారి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు వేదికలలో విత్తన మేళా

## రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలన్నఎండపల్లి మండల వ్యవసాయ అధికారి కమల్ల మహేష్

ఎండపల్లి, జూన్ 22 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం లో 23 వ తేదీ మంగళవారం రోజు నుండి 30 వ తేదీ వరకు ఎండపల్లి మండలం లోని ప్రతి రైతు వేదికల లో విత్తన మేళా జరుగుతుందని. ఈ విత్తన మేళా లో ప్రభుత్వం సాగుకు సూచించిన బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ సోన), హెచ్ఎంటీ సోన, జైశ్రీరామ్, కేఎన్ఎం 1638, కేఎన్ఎం 7715, డబ్ల్యుజీఎల్ 44 రకాల వరి విత్తనాలు రైతుల కు అందుబాటు లో ఉంటాయి అలాగే కందులు, పెసర్లు, మినుములు, కూర గాయలు, ఇతర ప్రత్యా మ్నాయ పంటల విత్తనాలు ప్రదర్శన, విక్రయాలు ఉంటాయి. నానోయూరియా నానో డీఏపీ ఉత్పత్తులు కూడా అందు బాటులో ఉంటాయి. కావున రైతులు అందరూ ఈ అవకాశం సద్వినియోగం చేసు కోవాలని ఎండపల్లి మండల వ్యవసాయ అధికారి కమల్ల మహేష్ విజ్ఞప్తి చేశారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు

## -జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,జూన్ 22:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వహించకుండా ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, వెంకట్ రెడ్డిలతో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని,ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులోగా పరిష్కరించి బాధితులకు సమాధానం అందించాలని స్పష్టం చేశారు.ముఖ్యంగా సమాచార హక్కు చట్టం కింద వచ్చే దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని, శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను క్రమం తప్పకుండా సమీక్షించి అనవసర జాప్యాన్ని నివారించాలని సూచించారు.క్షేత్రస్థాయిలో కొంతమంది సిబ్బంది లంచాలు డిమాండ్ చేస్తున్నట్లు వస్తున్న ఫిర్యాదులపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ,అవినీతిని ఏమాత్రం సహించేది లేదని,అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని హెచ్చరించారు.ప్రభుత్వ ఉద్యోగులు,ఫీల్డ్ సిబ్బంది క్రమశిక్షణతో విధులకు హాజరు కావాలని, అవుట్‌సోర్సింగ్ మరియు కాంట్రాక్ట్ సిబ్బంది వేతనాల చెల్లింపులో జాప్యం జరగకుండా చూడాలని ఆదేశించారు.కార్యాలయాలు,ఆవరణల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని,త్వరలో నిర్వహించనున్న 99 రోజుల ప్రజాపాలన ప్రగతి సమీక్ష కోసం వాస్తవ నివేదికలను సిద్ధం చేసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో డీఆర్వో రాజేశ్వరి,ఆర్డీవోలు గంగయ్య,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో అన్నదాన వితరణ



హనుమకొండ జూన్ 22 ప్రజా కలం ప్రతినిధి అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ రోజు అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రంలో కేయూసి క్రాస్ రోడ్ దగ్గర అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించినాము. ఈ కార్యక్రమానికి ముఖ్యదాత వల్లాల రాజేందర్ కృష్ణవేణి దంపతులు ఈ రోజు జరిగే అన్నదాన కార్యక్రమానికి విరాళాలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయం అర్చకుడు శ్రీ నాగరాజ్ శర్మ గారు హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్టేట్ జనరల్ సెక్రెటరీ దూశెట్టి భాస్కర్, స్టేట్ జోనల్ సెక్రెటరీ కంకటి సాగర్ గౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు భయాన సంతోష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల శ్రీనివాస్ గౌడ్, జిల్లా సెక్రెటరీ గంగారపు బాలరాజు, జిల్లా కోశాధికారి ఇనుగాల సుదర్శన్, వాలంటీర్ కమాండర్ ఆగపాటి అజయ్,జిల్లా కమిటీ సభ్యులు, కొండ శ్రీనివాస్,బాదావత్ బాలాజీ, చెల్పూర్ భాస్కర్,జక్కు మధు కృష్ణ గౌడ్,డి నరసయ్య, దిండిగాల కాంతారావు, వేణుగోపాల్ స్వామి,శ్రీధర్ రావు,వంశీ, తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాలు ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన ఈస్ట్ జోన్ డిసిపి ఎస్. అంకిత్ కుమార్



( వరంగల్/ పర్వతగిరి) జూన్ 22, ప్రజా కలం ప్రతినిధి. సోమవారం ఈస్ట్ జోన్ డిసిపి ఎస్ అంకిత్ కుమార్, మామ్నూర్ ఏసిపి ఎన్ వెంకటేష్, పర్వతగిరిలోని మోడల్ స్కూల్ సమీపంలో ఆదివారం జరిగిన రెండు ద్విచక్ర వాహనాల ఘోరమైన రోడ్డు ప్రమాద స్థలాన్ని సందర్శించి, ప్రమాద స్థలాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులను, సంభావ్య కారణాలను విశ్లేషించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా నివారించడానికి రోడ్డు భద్రతా చర్యలు, నివారణ చర్యల గురించి అవసరమైన పరిశీలనలు చేస్తామని స్పష్టం చేసిన ఈస్ట్ జోన్ డిసిపి యస్. అంకిత్ కుమార్, ఏసీపి ఎన్ వెంకటేష్.

## యంజీయం మార్చురీ లో మృతులకు నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



( వరంగల్/ పర్వతగిరి) జూన్ 22, ప్రజాకలం ప్రతినిధి. సోమవారం యంజీయం మార్చురీ లో ఆదివారం పర్వతగిరి మోడల్ స్కూల్ సమీపంలో జరిగిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ప్రాణాలు కోల్పోయిన పర్వతగిరి చెందిన బుద్దె చరణ్, సోమారం నివాసులు వడ్లకొండ ఎల్లగౌడ్, మహ్మద్ అహ్మద్ ల భౌతికకాయాలకు నివాళులర్పించి సంతాపం తెలిపిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు. ప్రమాదం ఎలా జరిగిందని సంబందీకులను అడిగి తెలుసుకుని, మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మహ్మద్ అయూబ్, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు, మండల అధ్యక్షులు జాటోతు శ్రీనివాస్ నాయక్, జిల్లా పరిషత్ మాజీ సభ్యులు సర్వర్, సర్పంచ్ లు ఏర్పుల శ్రీనివాస్, జున్ను కనకయ్య, యస్టీ సెల్ అధ్యక్షులు భాస్కర్, మహ్మద్ అలీ, డీలర్ బాబు, జంగిలి బాబు, జంగిలి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ ఫలాలు ప్రతి బిడ్డకు చేరాలి

### - ఘనంగా ఎమ్మార్పీఎస్ వేడుకల నిర్వాహణకు ఏర్పాట్లు

మల్హార్, జూన్ 22 ప్రజాకలం ప్రతినిధి...

జులై 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని మల్హార్ రావు మండల వ్యాప్తంగా ఉన్న ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి జిల్లా ఇన్చార్జి మడిపల్లి శ్యాంబాబు మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం మల్హార్ రావు మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్లో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కేసారపు నరేష్ మాదిగ అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్యాంబాబు మాట్లాడుతూ.. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు 'గో టు విలేజ్' పిలుపుతో నాయకులంతా మాదిగ పల్లెలకు తరలివెళ్లాలన్నారు. 30 ఏళ్ల పోరాటంతో సాధించుకున్న ఎస్సీ వర్గీకరణ ఫలాలను జాతి బిడ్డలకు చేర్చడానికి యువతను చైతన్యపరచాలని కోరారు. జులై 7న ప్రతి పల్లెలో జెండా ఆవిష్కరణలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దోర్నాల రాజేందర్, మహదేవపూర్ అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్, ప్రధాన కార్యదర్శి తాండ్ర దినేష్, నాయకులు నవీన్, సారయ్య, ఎర్ర పోచం, శ్యామ్, అరుణ, శివసాయి తదితరులు పాల్గొన్నారు.



## నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థల వ్యాపారం అరికట్టాలి

### - జిల్లా విద్యాశాఖ అధికారి డీఈఓ కు వినతిపత్రం

### - తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసీరామ్

నిర్మల్ జూన్ 22(ప్రజాకలం ప్రతినిది ):

కేంద్రంలోని ప్రైవేటు విద్యాసంస్థల అధిక ఫీజులు మరియు బుక్స్, బ్యాగులు, యూనిఫాం అక్రమ విక్రయాలను, విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని దానితోపాటు ఎటువంటి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక రేట్లకు నోటు పుస్తకాలు, అమ్మడం జరుగుతుంది ప్రైవేటు స్కూల్ యజమాన్యాలపే పరమైన చర్యలు తీసుకొని బయట అమ్ముతున్న షాపులను వెంటనే సీజ్ చేయాలని తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసీరామ్ జిల్లా విద్యాశాఖ అధికారి డీఈఓ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పల్లపు తులసీరామ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ విద్యా సంస్థలు ట్రేడింగ్ లైసెన్స్ లేకుండా, ఒరిజినల్ బిల్స్ ఇవ్వకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంతో బుక్స్, యూనిఫామ్ షూస్, బ్యాగ్స్, స్టేషనరీ సామాన్లని బయట సెటర్లో పెట్టి విద్యార్థులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. తెలియజేయడం జరిగింది. వాటిని వెంటనే



సీజ్ చేసి వాటికి సంబంధించిన పాఠశాలల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం జరిగింది. లేనిపక్షంలో తెలంగాణ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతామని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసీరామ్ మరియు నిర్మల్ జిల్లా అధ్యక్షులు రత్నల్లి రాజశేఖర్,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముల్క సందీప్, పాల్గొన్నారు

## పర్వతగిరిలో ఘోర రోడ్డు ప్రమాదం

### రెండు బైకులు ఢీకొని మైనర్ విద్యార్థి మృతి

#### మరో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమం - పర్వతగిరి మోడల్ స్కూల్ సమీపంలో విషాదం

వరంగల్/పర్వతగిరి) జూన్ 22, ప్రజాకలం ప్రతినిధి.

వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో ఆదివారం ఘోర రహదారి ప్రమాదం జరిగింది. మోడల్ స్కూల్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానినొకటి బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 16 ఏళ్ల మైనర్ విద్యార్థి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడి మృత్యువుతో పోరాడుతున్నారు. క్షతగాత్రులు తూరుకల సోమారం గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. స్థానికులు మరియు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమారం గ్రామానికి చెందిన బాధితులు ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తుండగా పర్వతగిరి మోడల్ స్కూల్ వద్దకు రాగానే ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు అత్యంత వేగంగా ఢీకొన్నాయి. ప్రమాద తీవ్రతకు వాహనాలు పూర్తిగా ధ్వంసమవగా, వాటిపై ఉన్నవారు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. తలకు బలమైన గాయాలు కావడంతో పర్వతగిరి మండల కేంద్రానికి చెందినకి బుద్ధ చరణ్ (16) అనే విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు.



**ముగ్గురికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం**

ఈ ప్రమాదంలో సోమారం గ్రామానికి చెందిన ఎల్లగౌడ్,ఎండి. తయ్యబ్ లతో పాటు మృతి చెందిన బుద్ధ చరణ్ స్నేహితుడైన మరో యువకుడికి తీవ్ర శారీరక గాయాలై, భారీగా రక్తస్రావమైంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను అత్యవసర చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం.

**మండల కేంద్రములో విషాద ఛాయలు**

సమాచారం అందుకున్న పర్వతగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బుద్ధ చరణ్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఒకే గ్రామానికి చెందిన వారు ప్రమాదానికి గురికావడం, మైనర్ విద్యార్థి మృతి చెందడంతో మండల కేంద్రంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

## విధుల నిర్వహణలోనే అనంత లోకాలకు..

### లారీ రూపంలో వచ్చిన మృత్యువు!

### - భూపాలపల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### ఇన్చార్జ్ డీటీవో వెంకన్న దుర్మరణం





భూపాలపల్లి, జూన్ 22 ప్రజాకలం ప్రతినిధి :

భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని చెల్పూర్ ఆర్టీవో కార్యాలయం సమీపంలో సోమవారం ఉదయం ఒక కలచివేసే ప్రమాదం జరిగింది. విధి నిర్వహణలో ఉన్న జిల్లా ఇన్చార్జ్ డీటీవో వెంకన్నను అతివేగంగా దూసుకొచ్చిన బొగ్గు లారీ బలితీసుకుంది. ఈ దారుణ ఘటన రవాణా శాఖలో తీవ్ర విషాదాన్ని నింపింది.

**అసలేం జరిగిందంటే..** పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. సోమవారం ఉదయం కర్పూరపల్లి ప్రాంతంలో డీటీవో వెంకన్న తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని ఒక హార్వెస్టర్ వాహనాన్ని సీజ్ చేసి, చెల్పూర్ ఆర్టీవో కార్యాలయానికి తరలించారు. కార్యాలయం సమీపంలో తన కారును రోడ్డు పక్కన నిలిపి, సీజ్ చేసిన వాహనాన్ని లోపలికి పంపించే ఏర్పాట్లను ఆయన స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.అదే సమయంలో భూపాలపల్లి వైపు నుంచి అతివేగంగా, అదుపులేకుండా ఒక బొగ్గు లారీ దూసుకొచ్చింది. ప్రమాదాన్ని గమనించిన వెంకన్న, తన సిబ్బందిని కాపాడేందుకు ప్రయత్నించారు. కానీ లారీ డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో, ఆ లారీ ముందుగా హార్వెస్టర్‌ను, ఆపై పక్కనే పార్క్ చేసి ఉన్న డీటీవో కారును బలంగా ఢీకొట్టింది. అంతటితో ఆగక చివరకు వెంకన్నపైకి దూసుకెళ్లింది. లారీ చక్రాలు ఆయనపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలపాలైన వెంకన్న అక్కడికక్కడే కన్నుమూశారు. సమాచారం అందుకున్న గణపురం సీఐ కరుణాకర్ రావు, ఎస్ఐ బొరగాల అశోక్ లు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**నెల కూడా గడవకముందే విషాదం:**వెంకన్న ఈ నెల 4వ తేదీన జగిత్యాల జిల్లా నుంచి బదిలీపై వచ్చి ఇక్కడ ఇన్చార్జ్ డీటీవోగా బాధ్యతలు స్వీకరించారు. విధుల్లో చేరి కనీసం నెల రోజులు కూడా గడవకముందే ఈ ఘోరం జరగడం సహచరులను తీవ్రంగా కలచివేసింది. ప్రస్తుతం హన్మకొండలో నివసిస్తున్న ఆయన, త్వరలోనే కుటుంబంతో సహా భూపాలపల్లికి మారాలని భావించారు. అంతలోనే ఈ విషాదం చోటుచేసుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

**ప్రముఖుల సంతాపం:** డీటీవో వెంకన్న మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరి శెట్టి సంకీర్త్ లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో వెంకన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## గృహ నిర్మాణాలకు శ్రీకారం

### - సర్పంచ్ జంగిడి శ్రీనివాస్ ముదిరాజ్...



మల్హార్, జూన్ 22 ప్రజాకలం ప్రతినిధి : మండలంలోని ఎడ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల గృహ నిర్మాణానికి సోమవారం గ్రామ సర్పంచ్ జంగిడి శ్రీనివాస్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఒక వరం లాంటిదన్నారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రజినీకాంత్, ఉప సర్పంచ్ వేల్పుల రమేష్, వార్డు సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## చిన్నతూండ్ల లో ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల ప్రారంభం



మల్హార్, జూన్ 22 ప్రజాకలం ప్రతినిధి : మండలంలోని చిన్నతూండ్ల గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు సోమవారం ఘనంగా శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ గడ్డం క్రాంతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా లబ్ధిదారుల సమక్షంలో ఇందిరమ్మ ఇండ్ల శంకుస్థాపనకు సంబంధించిన ముగ్గు పోతా కార్యక్రమాన్ని సర్పంచ్ అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం క్రాంతి మాట్లాడుతూ.. అర్హులైన పేద ప్రజలందరికీ సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ఈ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేస్తామని పట్టుబట్టారు. గ్రామంలో ఇండ్ల నిర్మాణాలు ప్రారంభం కావడం పట్ల స్థానిక లబ్ధిదారులు మరియు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రతినిధులు, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సర్పంచ్ గడ్డం క్రాంతిని పరామర్శించిన దుద్దిళ్ళ శ్రీను బాబు



మల్హార్, జూన్ 22 ప్రజాకలం ప్రతినిధి : బైక్ ప్రమాదంలో గాయపడిన మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, చిన్నతూండ్ల గ్రామ సర్పంచ్ గడ్డం క్రాంతిని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీను బాబు ఆదివారం పరామర్శించారు. వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. క్రాంతి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఐత రాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ చీమల సందీప్, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు మండల్ రాహుల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, కాంపాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మిద్దాం

### - ఏఎస్ఐ మనోహర్ రావు పిలుపు



( వరంగల్/పర్వతగిరి) జూన్ 22, ప్రజాకలం ప్రతినిధి

యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పర్వతగిరి ఏఎస్ఐ మనోహర్ రావు పిలుపునిచ్చారు. ప్రపంచ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలోని స్థానిక జడ్పీహెచ్ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణ కోసం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 'ఈగల్ ఫోర్స్' తెలంగాణ పోలీస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

**చదువు కన్నా సంస్కారం మిన్న-ఇంచార్జ్ ప్రిన్సిపాల్ పాక రమేష్.**

జడ్పీహెచ్ఎస్ స్కూల్ ఇంచార్జ్ ప్రిన్సిపాల్ పాక రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో చదువు కన్నా సంస్కారం, క్రమశిక్షణ ఎంతో మిన్న అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం ఎంత ముఖ్యమో, వారు డ్రగ్స్, మద్యపానం, ధూమపానం లాంటి చెడు వ్యసనాలకు బానిస కాకుండా చూసుకోవడం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. విద్యార్థులు తప్పుడు స్నేహితులను ఎంచుకుని తమ బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని హితవు పలికారు. క్రమశిక్షణకు మాతృభాష మౌనం అని పేర్కొంటూ, విద్యార్థులు నిశ్శబ్దంగా, ఏకాగ్రతతో ఉంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఈగల్ ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ లు రమేష్, కభీర్, శ్రావణ్ రెడ్డి లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాజీ కార్పోరేటర్ పులి జగన్ ఒంటెద్దు పోకడ

- తన ఇష్టానుసారం డివిజన్ అధ్యక్షుని ఎంపిక
- సీనియర్లను పక్కన పెట్టి నిన్న మొన్న వచ్చిన వారికే పట్టం
- పులి జగన్ వ్యవహార శైలిని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తా....
- అంబర్పేట్ నియోజకవర్గ మైనారిటీ సెల్ మాజీ చైర్మన్ మహమ్మద్ ఇస్సాముద్దీన్



హైదరాబాద్ జూన్ 22(ప్రజాకలం న్యూస్) అంబర్పేట్ డివిజన్లో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుని ఎంపికలో పార్టీలో కష్టపడ్డ సీనియర్లను పక్కనపెట్టి నిన్న మొన్న పార్టీలోకి వచ్చిన వారికి అంబర్పేట్ డివిజన్ ఇంచార్జ్ పులి జగన్ డివిజన్ అధ్యక్ష పదవి కట్టబెట్టారని అంబర్పేట్ నియోజకవర్గ మైనారిటీ సెల్ మాజీ చైర్మన్ మహమ్మద్ ఇస్సాముద్దీన్ ఆరోపించారు. అంబర్పేట్ డివిజన్ అధ్యక్షుడు ఎంపిక పారదర్శకంగా లేదని ఆరోపిస్తూ సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ అంబర్పేట్ డివిజన్ అధ్యక్షుని ఎంపిక విషయంలో పార్టీ సీనియర్లను సంప్రదించకుండా, ఎవరి అభిప్రాయాలు తీసుకోకుండా, ఎంతోకాలంగా పార్టీలో పనిచేస్తున్న వారిని గుర్తించకుండా ఏకఛత్రాధిపత్యంగా సొంత నిర్ణయాలు తీసుకుంటూ తన వర్గానికి చెందిన వ్యక్తికి డివిజన్ అధ్యక్ష పదవిని కట్టబెట్టి సీనియర్లను అవమానపరిచారని ఇస్సాముద్దీన్ అసహనం వ్యక్తం చేశారు. ఎంతోకాలంగా పార్టీ నే నమ్ముకుని, నిస్వార్ధంగా పార్టీకి సేవలు అందిస్తున్న మాకు గౌరవం లేదని,మేము ఇంకా జెండాలే మోయాలా అని ఆవేదన వ్యక్తం చేశారు. అంబర్పేట్ డివిజన్ అధ్యక్షుని ఎంపిక సక్రమంగా లేదని ఈ విషయంలో నియోజకవర్గ ఇన్చార్జి,అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని ఇస్సాముద్దీన్ పేర్కొన్నారు.

# ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేయడం సరికాదు

వార్డు మెంబర్ అక్కవత్రి ప్రవీణ్ కుమార్

ప్రభుత్వ బడులలోనే పిల్లలను చేర్పించాలి

అన్ని సదుపాయాలు, నాణ్యమైన బోధన అందుబాటులో ఉన్నాయి

నల్లూరు 5వ వార్డు మెంబర్ పిలుపు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూన్ 22: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు కోసం తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ బడులలోనే చేర్పించాలని నల్లూరు గ్రామ ఐదవ వార్డు మెంబర్ అక్కవత్రి ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో ప్రభుత్వం నుంచి ఉద్యోగం, పింఛన్, రేషన్ కార్డు, ఇల్లు, అలాగే ప్రభుత్వ అధికారి అల్లుడు కావాలని కోరుకునే ప్రజలు, పిల్లల చదువు విషయానికి వచ్చేసరికి ప్రభుత్వ బడులను వదులుకోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు మరియు ప్రయోజనాలను ఆశిస్తూ, ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నిర్లక్ష్యం చూపడం ఎంతమాత్రం సరికాదని ఆయన పేర్కొన్నారు. ప్రజల్లో ప్రభుత్వ విద్యపై మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని సూచించారు. నేటి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన బోధన, డిజిటల్ విద్య, మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పుస్తకాలు మరియు యూనిఫారాలు వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. ఇంతటి సౌకర్యాలు ఉన్నప్పటికీ కొంతమంది తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను తక్కువగా చూడటం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థపై పూర్తి విశ్వాసముంచి, తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం స్థానిక ప్రభుత్వ బడులలో చేర్పించిన తల్లిదండ్రులకు ఆయన ప్రత్యేకంగా శుభాభినందనలు మరియు కృతజ్ఞతలు తెలియజేశారు. "మన పిల్లల భవిష్యత్తు మనబడి తోనే ప్రారంభమవుతుంది" అని పేర్కొంటూ, గ్రామ ప్రజలందరూ ప్రభుత్వ విద్యాభివృద్ధికి ముందడుగు వేసి సహకరించాలని ప్రవీణ్ కుమార్ కోరారు.

# గ్రేటర్ లో ఎన్నికలకు జనసేన కసరత్తు

హైదరాబాద్ : తెలంగాణలో పోటీ చేస్తామని ప్రకటించిన పవన్ కళ్యాణ్.. ఆ దిశగా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఇప్పటికే హైదరాబాద్లో జనసేన పార్టీ కార్యాలయం ఉండగా.. తాజాగా మరో కొత్త పార్టీ ఆఫీస్ను ప్రారంభించనున్నారు. తెలంగాణలో జనసేనను బలోపేతం చేయడంలో భాగంగా మణికొండలో నిర్మించిన పార్టీ కార్యాలయాన్ని నిర్మించారు. ఇక రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో జనసేన బరిలో ఉంటామని ప్రకటించిన పవన్.. కసరత్తు మొదలుపెట్టారు. ఆంధ్రప్రదేశ్లో జనసేన పార్టీ అధికార కూటమిలో భాగం కాగా.. ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఉపముఖ్యమంత్రి పదవిలో ఉన్నారు. ఈ క్రమంలోనే ఇటీవలి కాలంలో తెలంగాణలో జనసేన పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్లో జనసేన పార్టీ సభ నిర్వహణకు పోలీసులు, హైకోర్టు అనుమతులు ఇవ్వకపోవడం.. అధికార కాంగ్రెస్ నేతలు తీవ్ర విమర్శలు చేయడంతో.. వాటన్నింటికీ సమాధానంగా.. తెలంగాణలో జనసేన పార్టీ ఉంటుందని తేల్చి చెప్పిన పవన్ కళ్యాణ్.. ఏ పార్టీ కలిసి వచ్చినా, రాకపోయినా.. ఒంటరిగానైనా బరిలోకి దిగుతామని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తెలంగాణలోనూ జనసేన పార్టీకి క్షేత్రస్థాయిలో బలం పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే తెలంగాణపై జనసేన పార్టీ ఫుల్ ఫోకస్ పెట్టింది. ఇటీవలి కాలంలో పవన్ కళ్యాణ్ హైదరాబాద్లో ప్రెస్మీట్ పెట్టడం, ఆ తర్వాత ఢిల్లీలో జరిగిన సేన ప్రస్థానం కార్యక్రమంలో తెలంగాణ గురించి ప్రస్తావించడం.. హనుమకొండలో తన అభిమాని నిరంజన్ను కలవడం వంటి వరుస సంఘటనలతో.. పవన్ కళ్యాణ్ తెలంగాణపై దృష్టి పెట్టినట్లు స్పష్టంగా అర్థం అవుతోంది. దీంతో తెలంగాణ జనసేన నేతల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది. ఇందులో భాగంగానే రాష్ట్రంలో జనసేన పార్టీని విస్తరించడంలో భాగంగా హైదరాబాద్ మణికొండలో కొత్తగా నిర్మించిన జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం పనిచేయనుంది. రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో పోటీ చేయడమే లక్ష్యంగా జనసేన పార్టీని బలోపేతం చేయడంతోపాటు.. పార్టీ సంస్థాగత నిర్మాణం కోసం ఈ కొత్త ఆఫీసును ప్రారంభించనున్నట్లు జనసేన వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణలో జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు తానే స్వయంగా రంగంలోకి దిగుతానని ఇప్పటికే పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే కొత్త ఆఫీస్ ప్రారంభోత్సవం సందర్భంగా పవన్ కళ్యాణ్ ఏం మాట్లాడనున్నారు అనేది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఇక ఇప్పటికే పవన్ కళ్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలు, ఆయన పర్యటనలపై తెలంగాణ కాంగ్రెస్ నేతలు తీవ్ర విమర్శలు గుప్పిస్తుండగా.. తాజాగా జనసేన పార్టీ ఆఫీస్ ప్రారంభోత్సవం గురించి ఎలా స్పందిస్తారోననే ఉత్కంఠ నెలకొంది

పక్కా ప్లాన్ తోజనసేనాని: తెలంగాణ రాజకీయాల్లో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇటీవల ప్రకంపనలు సృష్టించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు ఆయన తలపెట్టిన సభను కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంది. మరోవైపు కవితతో పాటు భారత రాష్ట్ర సమితి నేతలు సైతం టార్గెట్ చేసుకున్నారు. వారిలో ఒక రకమైన భయం కనిపించింది పవన్ కళ్యాణ్ ద్వారా. ఇప్పుడు అదే నిజం చేస్తున్నారు పవన్. తెలంగాణ రాజకీయాల వైపు తొంగి చూస్తున్నారు. అక్కడే ఉండి రాజకీయాలు చేయనున్నారు. హైదరాబాదులో పార్టీ తెలంగాణ కార్యాలయాన్ని అందుబాటులోకి తెస్తున్నారు.

# చేనేతలకు చేయూతనిద్దాం

- నిరుపేద చేనేత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి
- నిరుపేద పద్మశాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత
- టిపిఆర్ యుఎస్ హైద్రాబాద్ జిల్లా అధ్యక్షులు వడ్డేపల్లి నర్సింగరావు
- నిరుపేద చేనేత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి
- వైట్ హౌస్ కు వస్త్రాలు పంపిణీ చేసిన నేతన్నలు ఇప్పుడు విలవిలలాడుతున్నారు.



హైద్రాబాద్ జూన్ 23 (ప్రజాకలం హైద్రాబాద్ జిల్లా పద్మశాలి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం 2018లో రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు నేతృత్వంలో స్థాపించబడింది. అవసరమైన సభ్యులకు రిటైర్మెంట్ లావాదేవీలలో ఏర్పడిన సమస్యల పరిష్కారానికి తగు సలహాలిస్తు ముందుకు కొనసాగుతున్నది.

ఈ సంఘం సామాజిక విషయాలలో కూడా పాలుపంచుకోవాలనే సదుద్దేశంతో అధ్యక్షులు జిల్లా వడ్డేపల్లి నర్సింగరావు ఆలోచనల మేరకు కార్యవర్గ సభ్యుల ఆర్థిక సహకారంతో 2024 నుండి వినూత్నమైన రీతిలో వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఈ మేరకు కమిటీ సభ్యులు సర్వశ్రీ దోర్నాల విజయకుమార్, కోమాకుల సమ్మయ్య, గెంట్యాల రామచంద్రం, బోడ అశోక్ ప్రసంగిస్తూ.. పిల్లలను అనాథ విద్యార్థి గృహాలలోగాని, గురుకులాల్లో గాని బాగా చదివించి విద్యావంతులను చేయాలన్నారు. సంఘం అధ్యక్షులు వడ్డేపల్లి నర్సింగరావు మాట్లాడుతూ.. చిన్న వయసులోనే ఉపేందర్ మరణించడం బాధాకరమని, చేనేత కార్మికులు పనితో పాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని హితవు పలికారు.

చేనేతకు ఆదరణ కరువై,కార్మికులు పనిలేక దుర్భర జీవితం గడుపుతున్నారని, ఒకప్పుడు వందలాది పారిశ్రామికులకు పనికల్పించడమే గాక, అమెరికాలోని వైట్ హౌస్ కు సైతం ఫర్నిషింగ్ వస్త్రాలు ఎగుమతి చేసిన కొయ్యలగూడెం చేనేత సహకార సంఘం నేడు విల విలలాడుతున్నదని, ఇప్పటికైనా ప్రభుత్వం చేయూతనందించి నేత వృత్తిపై ఆధారపడిన వారిని ఆదుకోవాలని, ప్రజలు కూడా కనీసం వారానికి ఒక రోజైన చేనేత వస్త్రాలు ధరించాలన్నారు.

తాను ప్రతిపాదించిన వెంటనే ఆర్థిక సహాయం అందజేసిన కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కొయ్యలగూడెం గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షులు పొట్టబత్తిని బాలరత్నం వారి కమిటీ సభ్యులు , సర్పంచ్ కైరంకొండ స్వప్న గణేష్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం, హైద్రాబాద్ జిల్లా ఔదార్యాన్ని ప్రశంసించగా, ఉపేందర్ భార్య గంగ వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# వైసీపీ కాపు స్ట్రాటజీ...కార్నర్ చేస్తూ !

విజయవాడ : పోయిన చోటనే వెతుక్కోవాలని ఒక ముతక సామెత. దీనిని ఎంతవరకూ జన సామాన్యం పాటిస్తుందో తెలియదు కానీ రాజకీయ పార్టీలు మాత్రం కచ్చితంగానే ఫాలో అవుతాయి. వారికి ఎపుడూ పోయేది అధికారం. తిరిగి దానిని తెచ్చుకోవడమే వారి వ్యవహారం. ఆ సమయంలో సరిగ్గా పాత సామెతనే వారు పదే పదే గుర్తు చేసుకుంటారు. ఇక వైసీపీ విషయానికి వస్తే ఏపీలో 2024 ఎన్నికల్లో దారుణంగా నష్టపోయింది. మితిమీరిన అతి విశ్వాసంతో నేల విడిచి చేసిన సాము గారెడీకి జనాలు ఇచ్చిన సీట్లు 11 మాత్రమే. కనీసం ప్రతిపక్ష స్థానం కూడా దక్కకుండా వైసీపీ చతికిలపడి పోయింది. ఇక తమ తప్పులు ఏమిటో వైసీపీ నేతలు ఎవరూ బాహాటంగా చెప్పరు. ఇక అధినాయకత్వం కూడా కూటమి మీదనే విమర్శలు తప్పించి ఆత్మ విమర్శ చేసుకోదు అని అంతా అనుకుంటున్నారు. కానీ వైసీపీ హైకమాండ్ ఓటమిని బాగానే పోస్ట్ మార్టం చేసింది అని ఆ పార్టీ రాజకీయ వ్యూహాలే స్పష్టం చేస్తున్నాయి. వైసీపీ 2019లో గెలవడానికి 2024 లో ఓడడానికి తమ ఇమేజ్ బలం వ్యూహాలతో పాటు కాపులు కూడా ఒక ప్రధాన కారణం అని గుర్తు చేసుకుంటోంది. కాపు ఓట్లు గుత్తమొత్తంగా కూటమికి పడిపోయాయని కూడా గ్రహించింది. అందుకే కోస్తా జిల్లాలలోని 101 సీట్లలో ఒక్క సీటూ దక్కలేదని కూడా వైసీపీకి అర్థం అయింది. ఈ క్రమంలో కాపులకు దగ్గర కావాలని వైసీపీ పక్కా వ్యూహామే రచించింది. కాపులు కనుక తమతో ఉంటే ఉత్తరాంధ్ర ఉభయ గోదావరి జిల్లాలలో మంచి విజయం ఖాయం అని గట్టిగా నమ్ముతోంది. దాంతోనే వైసీపీలో చాలా కాలంగా కాపులకు అతి ప్రాధాన్యత ఇస్తోంది. వారినే ముందు పెట్టి కూటమి ప్రభుత్వం మీద పవన్ కళ్యాణ్ మీద విమర్శలు చేయిస్తోంది. ఎవరు కాదనుకున్నా ఏపీలో రాజకీయం మొత్తం కులాల సమాహారం. కులం బట్టే రాజకీయం సీట్లూ ఓట్లూ అన్నీ ఉంటాయి.

అయితే జనసేన వైపు ఉన్న కాపులు కూటమిని కూడా భారీ మెజారిటీతో గెలిపించారు. కానీ కూటమి ప్రభుత్వంలో తమకు న్యాయం జరగడం లేదని వారంతా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు వైసీపీ కాపు నేతలు అదే పనిగా కూటమిని టార్గెట్ చేస్తున్నారు. ఇక కాపుల ఆత్మీయ సమ్మేళనం పేరుతో సమావేశాలను కూడా వైసీపీలో ఉన్న కాపు నాయకులే చొరవ తీసుకుని నిర్వహిస్తున్నారు. దానికి వైసీపీ అధినాయకత్వం ఫ్రీ హ్యాండ్ ఇచ్చేసింది అని అంటున్నారు.

తూర్పు కాపుల ఆత్మీయ సమావేశం పెడితే శ్రీకాకుళం వెళ్ళి వచ్చారు సీనియర్ వైసీపీ నేత బొత్స సత్యనారాయణ. ఇపుడు పశ్చిమ గోదావరి జిల్లాలో మరో సీనియర్ నేత తోట త్రిమూర్తులు 21న కాపుల కోసం సమావేశం పెడుతున్నారు. దీనిని వైసీపీకి చెందిన కాపు నేతలు మొత్తం హాజరవుతున్నారని అంటున్నారు.

# దారుస్సలామ్‌కు ఏమైంది?



హైదరాబాద్ : దారుస్సలామ్.. హైదరాబాద్లో ఈ పేరు తెలియనివారు ఉండరు. ఎంఐఎం పార్టీ కేంద్రకార్యాలయమే దారుస్సలామ్. ఒకప్పుడు .. ఈ కార్యాలయం వచ్చిపోయే వారితోనే కాదు.. పార్టీ కార్యకర్తలు, నాయకులతో నిండుగా కిక్కిరిసి ఉండేది. తమ సమస్యలు చెప్పుకొనే వారు కూడా పెద్ద ఎత్తున తరలి వచ్చే వారు. పార్టీ చీఫ్.. అసదుద్దీన్ ఓవైసీ ఉన్నా.. లేకపోయినా.. పార్టీ కార్యాలయం మాత్రం నిండుగా కనిపించేది. ముఖ్యంగా యువత ఎక్కువగా ఇక్కడ తిష్ఠవేసుకుని పార్టీ కోసం పనిచేసిన పరిస్థితి కూడా ఉండేది. కానీ.. గత రెండు మాసాలుగా దారుస్సలామ్ బోసిపోయిన పరిస్థితిని నెలకొంది. వచ్చేవారు లేరు. వచ్చినా.. ఇక్కడ సమాధా నం ఇచ్చేవారుకూడా లేకుండా పోయారన్న వాదన వినిపిస్తోంది. హైదరాబాద్ ఎంపీగా అసదుద్దీన్ ప్రాతినిధ్యం వహిస్తున్నా.. జాతీయ రాజకీయాలపై ఆయన ఎక్కువగా దృష్టి పెట్టారు. యూపీ సహా.. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడ ఎన్నికలు జరిగినా.. ఎంఐఎం జాడలు కనిపిస్తూనే ఉన్నాయి. ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లోనూ ఎంఐఎం పోటీ చేసింది. గతంలో బీహార్లోనూ పార్టీ పోటీ ఇచ్చింది. ముంబై కన్ను ఆ స్టార్ ప్లేయర్పైనే దీంతో అసదుద్దీన్.. జాతీయ రాజకీయాలపైనే ఎక్కువగా దృష్టి పెట్టారని తెలుస్తోంది. ఇక, ఆయన సోదరుడు, ఎమ్మెల్యే అక్బరుద్దీన్.. కేవలం అసెంబ్లీ సమావేశాలు ఉన్నప్పుడే కనిపిస్తున్నారని సమాచారం. ఎక్కువ భాగం.. విదేశాల్లోనే ఉంటున్నారని పార్టీ నాయకులు చెబుతున్నారు. దీంతో పార్టీకార్యాలయంలో కార్యక్రమాలు మందగించాయి. అదేసమయంలో వచ్చిపోయే వారి సంఖ్య కూడా తగ్గిపోయింది. ఇదిలావుంటే.. హైదరాబాద్ పాతబస్తీ రాజకీయాల్లో ఎంఐఎం పార్టీకి ఏళ్ల తరబడి తిరుగులేదన్న వాదన తెలిసిందే. అంతేకాదు.. భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో ఓవైసీ కుటుంబానికి చెందిన నాల్గవ తరం వారసుడు అక్బరుద్దీన్ ఓవైసీ కుమారుడు నూరుద్దీన్ ఓవైసీ రాజకీయ రంగప్రవేశం చేస్తారన్న ప్రచారం కూడా ఉంది. కానీ, ఆ జాడ కూడా ఎక్కడా కనిపించడం లేదు. మరోవైపు.. కాంగ్రెస్ పార్టీ ఇదే పాత బస్తీకి చెందిన మరో పార్టీకి అండగా ఉంటున్నదన్న సమాచంర హల్చల్ చేస్తోంది. దీంతో ఎంఐఎం ప్రభ తగ్గుతోందా? అనేది చర్చకు దారితీసింది. ఇక, జాతీయస్థాయిలో దృష్టి పెట్టినా.. ఎంఐఎంకు అనుకున్నంత మైలేజీ లేకుండా పోయిందన్న వాదన వినిపిస్తోంది. ఇలా..స్థానికంగా దృష్టి పెట్టకపోవడం, ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్ననేపథ్యంలో దారుస్సలామ్లో జనాల తాకిడి తగ్గిపోగా.. పార్టీకి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయని అంటున్నారు పరిశీలకులు. దీనిని సరిచేసుకుంటారా? లేక... ఇంతే అని వదిలేస్తారో చూడాలి.

# స్విస్ బ్యాంకుల్లో తగ్గిన భారతీయుల నిధులు

హైదరాబాద్ : స్విట్జర్లాండ్లోని బ్యాంకుల్లో భారతీయుల డబ్బుకు సంబంధించిన తాజా గణాంకాలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. స్విస్ నేషనల్ బ్యాంక్ విడుదల చేసిన వార్షిక నివేదిక ప్రకారం.. స్విస్ బ్యాంకుల్లో భారతీయులకు సంబంధించిన మొత్తం నిధులు మరోసారి తగ్గుముఖం పట్టాయి. అయితే ఇదే సమయంలో కస్టమర్ డిపాజిట్లు ఏకంగా 50 శాతం పెరగడం ఆర్థిక నిపుణులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అసలు మొత్తం నిధులు తగ్గి, డిపాజిట్లు పెరగడం వెనుక ఉన్న అసలు కథేంటో ఇప్పుడు చూద్దాం. 8 శాతం తగ్గిన మొత్తం నిధులు తాజా గణాంకాల ప్రకారం స్విస్ బ్యాంకుల్లో భారతీయులకు సంబంధించిన మొత్తం నిధుల విలువ 8 శాతం తగ్గి రూ. 36,793 కోట్లకు చేరింది. గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న తగ్గుదల ధోరణి ఈ ఏడాది కూడా కొనసాగడం గమనార్హం. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయాన్ని గమనించాలి. స్విస్ బ్యాంకుల్లో ఉండే భారతీయుల నిధులన్నీ "బ్లాక్ మనీ" కాదు. ఈ నిధులలో కేవలం వ్యక్తిగత ఖాతాల్లో ఉన్న డబ్బే కాకుండా భారతీయ బ్యాంకుల ద్వారా నిర్వహించే అంతర్జాతీయ పెట్టుబడులు.. వివిధ రకాల ట్రస్టుల నిధులు.. కార్పొరేట్ సంస్థల ఆర్థిక లావాదేవీలు.. ఇతర ఆస్తులు కూడా కలిసి ఉంటాయి. కాబట్టి ఈ మొత్తం నిధులను కేవలం అక్రమ సంపాదనగా భావించడం సరైనది కాదని ఆర్థిక విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. కస్టమర్ డిపాజిట్లు 50% పెరగడానికి కారణాలేంటి? ఒకవైపు మొత్తం నిధులు తగ్గుతున్నప్పటికీ కస్టమర్ డిపాజిట్లు మాత్రం ఏకంగా 50 శాతం పెరగడం ఆసక్తికరంగా మారింది. దీని వెనుక కొన్ని ప్రధాన కారణాలు ఉన్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. భారతీయ వ్యాపార సంస్థలు అంతర్జాతీయంగా విస్తరిస్తున్నాయి. గ్లోబల్ ట్రేడ్, విదేశీ కొనుగోళు,, అంతర్జాతీయ పెట్టుబడుల కోసం కార్పొరేట్ సంస్థలు స్విస్ బ్యాంకులను చట్టబద్ధంగా వినియోగిస్తున్నాయి. వ్యక్తిగతంగా దొంగచాటుగా డబ్బు దాచడం కంటే వ్యాపార అవసరాల కోసం పారదర్శకంగా అంతర్జాతీయ బ్యాంకింగ్ సేవలను ఉపయోగించుకోవడం పెరిగింది. కఠినమైన నిబంధనలు గతంలో స్విస్ బ్యాంకుల్లో భారతీయుల ఖాతాలపై దేశీయంగా తీవ్ర రాజకీయ, సామాజిక చర్చలు జరిగేవి. విదేశాల్లో అక్రమంగా దాచిన నల్లధనానికి స్విస్ బ్యాంకులు కేరాఫ్ అడ్రస్ అనే భావన ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. భారత్ – స్విట్జర్లాండ్ దేశాల మధ్య కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం.. స్విస్ బ్యాంకుల్లో ఖాతాలు ఉన్న భారతీయుల వివరాలు ప్రతి ఏటా భారత ప్రభుత్వానికి అందుతాయి. దీనివల్ల అక్కడ అక్రమ నిధులను దాచడం.. పన్ను ఎగవేతకు పాల్పడటం ఇప్పుడు దాదాపు అసాధ్యంగా మారింది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం కూడా మనీలాండరింగ్, పన్ను ఎగవేతదారులపై నిఘాను తీవ్రం చేసింది. అనేక అంతర్జాతీయ దేశాలతో సమాచార మార్పిడి ఒప్పందాలను కట్టుదిట్టం చేసింది. ఈ ప్రభుత్వ చర్యల భయం వల్లే స్విస్ బ్యాంకుల్లో భారతీయుల మొత్తం నిధులు తగ్గుతూ వస్తున్నాయని చెప్పవచ్చు.

# యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలి

- అక్లూర్ సర్పంచ్ జిన్నా జనార్దన్



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూన్ 22: వేల్పూర్ మండలంలోని అక్లూర్ గ్రామంలో సోమవారం నిర్వహించిన 'త్రై లోకీయ యూనిట్ కప్' క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఘనంగా ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు అక్లూర్ గ్రామ సర్పంచ్ జిన్నా జనార్దన్ ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు మరియు కప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జిన్నా జనార్దన్ మాట్లాడుతూ, క్రీడలు మానసిక ఉత్సాహాన్ని ఇవ్వడమే కాకుండా శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని తెలిపారు. యువత డ్రగ్స్ వంటి చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా, మంచి ఆటలు ఆడుతూ ఆరోగ్యకరమైన జీవితాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. జీవితంలో ఆటలు ఎంత ముఖ్యమో, చదువు కూడా అంతే ముఖ్యమని, యువత బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించిన 'త్రిలోక్య కన్సల్టెన్సీ' అధినేత పటేరీ నిక్షిత్‌కు సర్పంచ్ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సురేందర్ రెడ్డి, రామారెడ్డి, శేఖర్, వడ్ల రాజు, సల్మాన్ మరియు గ్రామ పెద్దలు, యువకులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్‌బీఐ వర్సెస్ ప్రభుత్వం

హైదరాబాద్ : రాయదుర్గం భూముల విషయంలో ఎస్బీఐ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య వివాదం రోజురోజుకూ తీవ్రం అవుతోంది. ఆ భూమి తమదే అంటూ ఎస్బీఐ హైకోర్టును ఆశ్రయించగా.. ధర్మాసనం స్టే ఇచ్చింది. ఈ క్రమంలోనే ఎస్బీఐ తీరుపై రేవంత్ సర్కార్ తీవ్రంగా మండిపడింది. ఆ భూమిని తాము గతంలోనే కొన్నామని.. అందులో కొంత భాగం తమదేనని కోర్టును ఆశ్రయించింది. ఈ వివాదంతో ప్రభుత్వానికి ఎస్బీఐలో ఉన్న అకౌంట్లను ఇతర బ్యాంకులకు మార్చాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. రాయదుర్గం భూముల వేలం ధరతో మాత్రమే కాకుండా.. వివాదాలతోనూ ఇప్పుడు దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచింది. వేలంలో ఎకరం ధర రూ. 237 కోట్లు పలికి.. అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసిన ఈ భూములపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) రంగంలోకి దిగింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీ పరిధిలో ఉన్న భూములను రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయగా.. అది తమ భూమే అని పేర్కొంటూ.. తెలంగాణ హైకోర్టులో ఎస్బీఐ రిట్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. ఈ వేలం ప్రక్రియపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ).. ఇటీవల గత నెల 28వ తేదీన రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1లోని అత్యంత విలువైన 11.38 ఎకరాల భూమిని వేలం వేయగా.. రూ. 2,529 కోట్లు రాష్ట్ర ఖజానాకు చేరాయి. అయితే అందులో 5.09 ఎకరాలు తమ భూమి ఉందంటూ ఇప్పుడు ఎస్బీఐ పేర్కొంటోంది. 2010లోనే ఆ భూమిని రూ. 13.33 కోట్లకు తాము కొనుగోలు చేశామని ఎస్బీఐ వాదిస్తోంది. ఈ భూములను వేలంలో గౌరా వెంచర్స్ అనే సంస్థ ఎకరం భూమిని రూ. 237 కోట్ల చొప్పున దక్కించుకుంది. ఈ నేపథ్యంలోనే ఎస్బీఐ వైఖరిపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం సీరియస్ అయింది. రాయదుర్గం భూముల వేలంలో నిబంధనలు ఉల్లంఘించింది ఎస్బీఐ అని ఆరోపిస్తోంది. ఈ భూముల వేలంపై ఎస్బీఐ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య తలెత్తిన వివాదం తీవ్ర పరిణామాలకు దారితీసేలా కనిపిస్తోంది. ఎస్బీఐతో రాష్ట్ర ప్రభుత్వానికి ముడిపడి ఉన్న ఆర్థిక సంబంధాలపై పునఃసమీక్ష చేయాలలని రేవంత్ సర్కార్ యోచిస్తోంది. ఎస్బీఓలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న డిపాజిట్లు, అకౌంట్ల వివరాల సేకరణ, ప్రభుత్వ అకౌంట్లను వేరే బ్యాంకులకు మార్చే అంశాలపై ప్రభుత్వం పునరాలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే ఎస్బీఐకి భారీ షాక్ తగలనుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఎస్బీఐ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. టీజీఐఐసీ నిర్వహించిన భూముల వేలం ప్రక్రియపై 3 వారాల పాటు స్టే విధిస్తూ తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ వివాదం వెనుక సుదీర్ఘ చరిత్ర ఉంది.

# అద్దెలు భరించేది ఎలా?

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో ఇండ్ల అద్దెలు విపరీతంగా పెరిగిపోతుండడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ముఖ్యంగా వెస్ట్ హైదరాబాద్‌లోని ఐటీ హబ్‌ను నమ్ముకుని జీవిస్తున్న చిరు వ్యాపారులు, ఉద్యోగులు అద్దెల భారాన్ని తట్టుకోలేకపోతున్నారు. కరోనాకు ముందుతో పోలిస్తే ప్రస్తుతం అద్దెలు రెట్టింపు అయ్యాయి. గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాల్లో ప్రస్తుతం 2ఃఊఐ ఫ్లాట్ అద్దె రూ. 25 వేల నుండి రూ. 45 వేల వరకు పలుకుతుండగా, సింగిల్ బెడ్రూమ్ ఇల్లు కూడా రూ. 15 వేలు చెల్లిస్తేనే దొరికే పరిస్థితి ఏర్పడింది. జూనియర్ ఉద్యోగులు తమ జీతంలో 40 నుండి 45 శాతం వరకు కేవలం అద్దెలకే వెచ్చించాల్సి వస్తోంది. ఇటీవలి నివేదికల ప్రకారం ఐటీ కారిడార్‌లో సగటు అద్దెలుగత ఏడాది కంటే 10% నుండి 15% వరకు పెరిగాయి.

## బ్రహ్మంగారు సమాధి తో ముగిసిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర బయలు నాటకం

### రావిరాల గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటక ప్రదర్శన

### వర్షాన్ని కూడ లెక్క చేయకుండా..నాటక ప్రదర్శన లో అధిక సంఖ్యలో పాల్గొన్న గ్రామ ప్రజలు



మహేశ్వరం, జూన్ 18, (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ జిహెచ్ఎంసి రావిరాల గ్రామంలో గత నాలుగు రోజుల నిర్వహిస్తున్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటక ప్రదర్శన నేటితో ముగిసింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ జిహెచ్ఎంసి రావిరాల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర బయలు నాటక ప్రదర్శన ను శ్రీ రాఘవేంద్ర స్వామి భజన మండలి వారిచే ప్రదర్శన.. 17 వ .తేదీ రోజు ఘనంగా ప్రారంభించారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాలుగు రోజుల పాటు ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. చివరి రోజు బ్రహ్మంగారి జీవ సమాధి తో ముగిసింది. వీధి నాటక ప్రదర్శన ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తారు. అదే మాదిరిగా ఈ సంవత్సరం కూడా నాలుగు రోజులపాటు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్రను శ్రీ రాఘవేంద్ర స్వామి భజన మండలి వారు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. పురాతన కళలు అంతరించిపోతున్న తరుణంలో తిరిగి కళలను అందరికీ గుర్తు చేస్తూ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్రను ప్రదర్శించడం అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా పాత్రధారులు సన్నివేశాలు అందరినీ ఆకర్షించాయి పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర ప్రదర్శన కార్యక్రమాన్ని కాటం భాస్కర్ సహకారంతో నిర్వహిస్తున్నారు. చివరి రోజు నాటక ప్రదర్శనకు గ్రామంలో ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## పేదల ఆకలి తీరుస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు: రవీందర్ ముదిరాజ్




ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) లయన్స్ క్లబ్ సభ్యులు పేదల ఆకలి తీరుస్తున్నారని సామాజిక నేతరవీందర్ ముదిరాజ్ పేర్కొన్నారు. సోమవారం లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ సభ్యులు సూరారం మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి ముందు ఈ సభ్యుల ఆధ్వర్యంలో నిరంతరం ఉదయం 8 గంటలకు సూరారం నారాయణ మల్లారెడ్డి హాస్పిటల్ వద్ద, ఆసుపత్రికి వచ్చిన వారికి ఉదయం ఎనిమిది గంటలకు అల్పాహారం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. నేటికీ 2000 రోజులు దాటి 2001వ రోజులో అడిగిడుతున్న సందర్భంగా సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ నార్త్ లైన్స్ క్లబ్ సికింద్రాబాద్ దినదినాభివృద్ధి చెందాలని ప్రజలకు సేవ చేస్తున్న ఆ సభ్యులకు అధ్యక్ష కార్యదర్శులకు పాల్గొంటున్న బీద వారందరూ కూడా ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా "కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి" జన్మదిన వేడుకలు



ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు సూరారం గ్రామంలోని విశ్వకర్మ కాలనీలోని ఆయన నివాసంలో ఘనంగా జరుగగా ఈ వేడుక కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులు ముఖ్యఅతిథులుగా హాజరై కొండకల్ల శ్రీనివాస్ రెడ్డితో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రజాసేవలో మరింత అభివృద్ధి చెందాలని శ్రీనివాస్ రెడ్డిని ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, సీనియర్ నాయకులు వారాల వినోద్, కోలా శ్రీకాంత్ ముదిరాజ్, సిద్దిక్, అభిమానులు, మహిళా నాయకురాల్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూన్ 22: మాదకద్రవ్యాల మహమ్మారిని రూపుమాపడానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని కమ్మర్పల్లి ఎస్సై సి. హెచ్.



సతీష్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం (వరల్డ్ డ్రగ్ డే) సందర్భంగా, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ ఆదేశాల మేరకు సోమవారం కమ్మర్పల్లి మండలంలోని బషీరాబాద్ గ్రామం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో డ్రగ్స్ నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సతీష్ మాట్లాడుతూ.. నేటి యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల దుష్పరిణామాలను తెలుసుకుని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. క్షణికానందం కోసం డ్రగ్స్ బారిన పడితే బంగారు భవిష్యత్తు నాశనమవడమే కాకుండా, నమ్ముకున్న కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి సారించి, సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. మాదకద్రవ్య రహిత సమాజ స్థాపనకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు ప్రజలు, యువత సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, గ్రామ సర్పంచ్, పోలీస్ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య వార్

### ఎమ్మెల్యే ను టార్గెట్ చేసిన బీఆర్ఎస్ నేత, డీసీసీ నేతలతో కౌంటర్ - భూ వివాదంలో 5 కోట్లన్న బీఆర్ఎస్, 50 కోట్లని కాంగ్రెస్

కంటోన్మెంట్: జూన్ 22:
ప్రజాకలం ప్రతినిధి

కంటోన్మెంట్ నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను లక్ష్యంగా చేసుకుని బిఆర్ఎస్ నేత క్రిశాంక్ చేసిన విమర్శలపై కాంగ్రెస్ శ్రేణులు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాయి. కోట్ల రూపాయల విలువైన భూమి వ్యవహారం లో ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం ముదిరింది. క్రిశాంక్ వ్యాఖ్యలకు కాంగ్రెస్ డీసీసీ నేతలు అంతే దీటుగా కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... క్రిశాంక్‌ను ఒక పిల్ల బచ్చాగా, కేవలం ఒక జీతగాడిగా అభివర్ణించారు. బిఆర్ఎస్ నేతలు లేనిపోని అబద్ధాలు ప్రచారం చేస్తూ, ప్రజల్లో భ్రమలు కల్పించేందుకు డ్రామాలు ఆడుతున్నారని,దొంగే దొంగ అన్నట్లు వారి వ్యవహారశైలి ఉందని మండిపడ్డారు.






నియోజకవర్గంలో మైనంపల్లి హనుమంతరావు వంటి సీనియర్ నేతలపై అవాకులు చవాకులు పేలిస్తే సహించేది లేదని, ఆయనపై చేసిన వ్యాఖ్యలను క్రిశాంక్ వెంటనే వెనక్కి తీసుకోవాలని హెచ్చరించారు. నియోజకవర్గంలో వివాదాస్పదంగా మారిన సదరు భూమిని కాపాడింది కాంగ్రెస్ పార్టీయేనని నేతలు స్పష్టం చేశారు. కంటోన్మెంట్ పరిధిలోకి హైడ్రా ను తీసుకువచ్చి, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. కంటోన్మెంట్ ప్రజల దీర్ఘకాలిక సమస్య అయిన భూములను ఫ్రీ హోల్డ్ చేసి, నిరుపేదలకు పట్టాలు ఇవ్వడంతో పాటు, వారికి ఇళ్లు కట్టించి ఇవ్వడమే లక్ష్యంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ నిరంతరం కృషి చేస్తున్నారని గుర్తుచేశారు. ప్రజలకు ఏం చేయాలో తెలిసిన ఎమ్మెల్యేను ప్రతి విషయంలోనూ అడ్డుకోవడమే క్రిశాంక్ లక్ష్యంగా పెట్టుకున్నారని, బట్టకాల్చి మీదేసే ఇలాంటి చౌకబారు రాజకీయాల వల్ల ప్రజల మనోభావాలు దెబ్బతింటున్నాయని కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.నీ స్థాయి ఏంటో తెలుసుకుని, ఒక జీతగాడిలా మాట్లాడు... బచ్చాగాడివి బచ్చాగా ఉండు అంటూ క్రిశాంక్‌కు ఘాటుగా హితవు పలికారు. నిజంగా సమస్యలు ఉంటే కంటోన్మెంట్ బోర్డు ముందు ధర్నా చేయాలని లేదా కోర్టులకు వెళ్లాలని, అంతేకాని ప్రజాప్రతినిధిని వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం సరికాదన్నారు. చర్యలకు ప్రతిచర్యలు తప్పవని హెచ్చ రించారు. ప్రజాక్షేత్రంలో ఎవరున్నారో ప్రజలే నిర్ణయిస్తారని, రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను ప్రజలు మళ్లీ భారీ మెజారిటీతో గెలిపిస్తారని కాంగ్రెస్ నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

## ఫ్రీ–ప్రైమరీ మంజూరు చేయకపోతే నిరవధిక దీక్షలు

### –సర్పంచ్ పోసాన్ పల్లి రాజు – విద్యా కమిటీ అధ్యక్షులు కోతం కృష్ణంరాజు

### –తిమ్మాపూర్ విద్యా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా




గజ్వేల్ నియోజకవర్గం: 22జ జూన్ (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ నియోజకవర్గం జగదేవపూర్ మండలం తిమ్మాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు తక్షణమే ఫ్రీ–ప్రైమరీ మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ తిమ్మాపూర్ విద్యా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ పోసాన్ పల్లి రాజు, విద్యా కమిటీ అధ్యక్షులు కోతం కృష్ణంరాజు లు మాట్లాడుతూ పాఠశాలకు ఫ్రీ–ప్రైమరీ ఏర్పాటు చేయడానికి అవసరమైన అన్ని అర్హతలు ఉన్నప్పటికీ,సంబంధిత అధికారులు ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం వహిస్తున్నారని విద్యా కమిటీ సభ్యులు మండిపడ్డారు. విద్యాభివృద్ధి పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.గత ఏడాది వాలంటీర్‌తో తరగతుల నిర్వహణ,విద్యాసంవత్సరంలో పాఠశాలలో గ్రామస్తుల చొరవతో సొంతంగా ఒక విద్యా వాలంటీర్‌ను నియమించుకుని యూకేజీ తరగతులను విజయవంతంగా నిర్వహించామని గుర్తుచేశారు. ఈ తరగతులు మరియు విద్యార్థుల వివరాలను విద్యాశాఖకు చెందిన అధికారిక 'యూ–డైస్ ప్లస్' పోర్టల్‌లో కూడా నమోదు చేశామని తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం కారణంగా చిన్నారుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోంది. వెంటనే స్పందించి మా పాఠశాలకు ఫ్రీ–ప్రైమరీని మంజూరు చేయాలి. అధికారులు స్పందించని పక్షంలో,రాబోయే రోజుల్లో బడి పిల్లలతో కలిసి కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరవధిక దీక్షలు నిర్వహిస్తాం" అని తీవ్రస్థాయిలో హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోసాన్ పల్లి రాజు,గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కొంతం లక్ష్మయ్య, విద్యా కమిటీ అధ్యక్షులు కొంతం కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి దండు ప్రవీణ్, వార్డు మెంబర్ కిష్టయ్య, బాలరాజు, స్వామి, సత్యనారాయణ, మహేందర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## నమ్మించి ప్లాట్ అమ్మిన ఘనుడు

### అదే ప్లాట్ పై రుణం తీసుకున్న మోసగాడు రిమాండ్

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) నమ్మించి ప్లాట్ అమ్మి అదే ప్లాట్ పై రుణం తీసుకున్న మోసగాడిని బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అమాయక దంపతులను నమ్మించి, వారి ఫ్లాట్‌ను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని రూ. 54 లక్షల బ్యాంకు లోన్ పొంది మోసానికి పాల్పడిన ప్రధాన నిందితుడు బానొత్ ప్రసాద్ రావు (37), ఖమ్మం జిల్లాలో పోలీసులు అరెస్ట్ చేశారు. లోన్ ఏజెంట్‌గా పనిచేస్తున్న నిందితుడు, నిజాంపేట్‌లో నివసించే రాపర్తి మనోహర్, గౌరి అనే దంపతుల కుమార్తె పెళ్లి ఖర్చుల అత్యవసరాన్ని, వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్నాడు. బాధితులకు రూ. 25 లక్షలు అప్పుగా ఇస్తూ, వారి ఫ్లాట్ ఒరిజినల్ పత్రాలను తాకట్టు పెట్టుకుని, ఆ తర్వాత



భయపెట్టి ఆ ఫ్లాట్‌ను తన సంస్థ పేరిట మార్చుకున్నాడు. అనంతరం ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగితో చేతులు కలిపి, ఆ ఫ్లాట్‌ను అతని పేరు మీదకు మార్చి ICICI బ్యాంక్ నుండి రూ. 54,24,000/- ల హోం లోన్ పొంది సొంతానికి వాడుకున్నాడు. జనవరి 2026లో బ్యాంక్ రికవరీ సిబ్బంది రాకతో ఈ వంచన వెలుగులోకి వచ్చింది. బాధితుల ఫిర్యాదుతో బాచుపల్లి సిఐ సి.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు దర్యాప్తు చేపట్టిన సబ్-ఇన్‌స్పెక్టర్ ఎం. సాయి విజ్ఞేష్ మరియు సిబ్బంది, 19.06.2026న ఖమ్మంలో నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడు నేరాన్ని ఒప్పుకోగా, అతని వద్ద నుండి 'వన్‌ప్లస్ ఓపెన్' మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై రీసెంట్‌గా దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ఇలాంటిదే ఒక మోసం కేసు నమోదైంది. అనంతరం నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచి జైలుకు పంపారు. పరారీలో ఉన్న మిగతా నిందితులు గురించి పోలీసు వారు విచారణ జరుపుతున్నారు. ఇలాంటి నిందితుల చేతిలో ఎవరైనా మోసపోయి ఉంటే, ధైర్యంగా ముందుకు వచ్చి సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సిందిగా సిఐ తెలిపారు.

## అభివృద్ధి కోరుతూ కలెక్టర్ ను కలిసిన ఎమ్మెల్యేలు

### – నియోజకవర్గాల సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసిన ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్‌రావు



సంగారెడ్డి ప్రతినిధి జూన్ 22( ప్రజా కలం):

సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల్లో నెలకొన్న పలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్‌రావు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులు, రైతు సమస్యలు, తాగునీటి సౌకర్యం, రోడ్లు, విద్యా సంస్థలు, గ్రామీణ మౌలిక వసతులు తదితర అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సదాశివపేట మండలం బొబ్బిలిగామ గ్రామ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉన్న వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుందని, అలాగే పాఠశాల భవన గోడలు దెబ్బతినడంతో కరెంట్ షాక్ వచ్చే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరడంతో పాటు గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ డి ఎఫ్ కింద రూ.5 కోట్లతో నియోజకవర్గ పరిధిలోని రెండు పట్టణాలు, నాలుగు మండలాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనల పురోగతిని కలెక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. మల్కాపూర్ గ్రామంలో అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేయడంతో పాటు ఇంటి నంబర్లు జారీ చేసిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కంది మండలం ఉత్తర్‌పల్లి గ్రామ పరిధిలో పణ్యాల నాగరాజు ఫీల్డ్ నుంచి చిట్యాల అఖిల్ ఫీల్డ్ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.23 లక్షల అంచనా వ్యయంతో పరిపాలనా అనుమతులు మంజూరు చేసి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సూరారం గ్రామంలోని యూపీఎస్ పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరగా, జిల్లాలోని పెండింగ్ బిల్లుల వివరాలను పరిశీలించి చెల్లింపులు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గిర్మాపూర్ గ్రామంలో రీజినల్ రింగ్ రోడ్డు భూ బాధితులకు నష్టపరిహారం చెల్లింపులో బయోమెట్రిక్ విధానాన్ని సడలించాలని ఎమ్మెల్యే కోరారు. అధిక వయస్సు కలిగిన రైతులకు వేలిముద్రలు సరిగా నమోదు కాకపోవడంతో నష్టపరిహారం చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయని వివరించారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా బీఎల్ఓలు పట్టణ ప్రాంతాల్లో డోర్ టు డోర్ సర్వే సక్రమంగా నిర్వహించడం లేదని, బీఎల్ఏలకు సరైన సమాచారం అందడం లేదని, దీంతో నివేదికల్లో పొరపాట్లు జరిగే అవకాశం ఉందని కలెక్టర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. 2026-27 సంవత్సరానికి రూ.1.98 కోట్లతో బోర్‌వెల్ పనులకు అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కోరారు. అదేవిధంగా జహీరాబాద్ నియోజకవర్గంలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌పై వ్యాఖ్యలు చేస్తే సహించం:కూన శ్రీశైలంగౌడ్




ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)సీఎం రేవంత్‌పై వ్యాఖ్యలు చేస్తే సహించామని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ హెచ్చరించారు. కొలను హనుమత్ రెడ్డి, డిసిసి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ కుమార్ యాదవ్ తో ఆయన కలసి మాట్లాడుతూ...భూ కబ్జాలకు కేరాఫ్ అడ్రస్ ఎమ్మెల్యే వివేకానంద అని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుపై ఎమ్మెల్యే వివేక్ మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే కుత్బుల్లాపూర్‌లో తిరగనివ్వబోమని హెచ్చరించారు.

టిడిపిలో గెలిచి అదే పార్టీని బేరం పెట్టిన వ్యక్తి వివేక్ అని విమర్శించారు. కమ్యూనిస్టు పార్టీ మినహా దాదాపు అన్ని పార్టీలను ఆయన మార్చారన్నారు. టీడీపీలో చేరి ఆ పార్టీని నిండా ముంచేశారని ఆరోపించారు.

వివేకానంద దొంగచాటుగా గెలిచిన ఎమ్మెల్యే అని, మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెప్పుకోదగ్గ అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో వేలాది ఇళ్లను పేదలకు అందించామని, కానీ వివేక్ పాలనలో అభివృద్ధి కనిపించలేదన్నారు.

కుత్బుల్లాపూర్‌లోని ప్రభుత్వ భూములను కేటీఆర్, హరీష్ రావులకు అమ్మించిన ఘనత వివేక్ కే దక్కుతుందని ఆరోపించారు. మైనంపల్లి హనుమంతరావు గురించి మాట్లాడే స్థాయి కూడా వివేక్ కు లేదని వారు వ్యాఖ్యానించారు.

తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 60 రేషన్ షాపులు, 200 మంది అంగన్‌వాడీ టీచర్లు, 200మంది ఆయాలను ఉద్యోగాల్లో నియమించామని గుర్తు చేశారు. అలాగే రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ ఇళ్ల పథకాల ద్వారా వేలాది కుటుంబాలకు లబ్ధి చేకూర్చడంతో పాటు 25వేల ఇళ్ల పట్టాలు అందించామని పేర్కొన్నారు. అదేవిధంగా 45వేల రేషన్ కార్డులు మంజూరు చేయించామని, పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేశామన్నారు. "నేను చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలు ప్రజల ముందు పెట్టడానికి సిద్ధంగా ఉన్నాను. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మీరు కుత్బుల్లాపూర్‌కు ఏం చేశారో చెప్పండి. ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు నేను సిద్ధం" అని కూన శ్రీశైలం గౌడ్ సవాల్ చేశారు.

# నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడు మైనంపల్లి

**- మైనంపల్లి హనుమంతరావుపై బిఆర్ఎస్ నాయకుల విమర్శలను తీవ్రంగా ఖండించిన నేతలు**



మల్కాజిగిరి,జూన్22(ప్రజా కలం ప్రతినిధి) బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, క్రిషాంక్‌లు కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావుపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మల్కాజిగిరిలో కాంగ్రెస్ నాయకులు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కాంగ్రెస్ నేతలు,తమ నాయకుడు మైనంపల్లి హనుమంతరావును విమర్శించే అర్హత కేటీఆర్‌కు,బిఆర్ ఎస్ నాయకులకు లేదన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి,అక్రమ ఆస్తుల వ్యవహారాలు ప్రజలకు తెలుసని, అందుకే ప్రజలు ఆ పార్టీని అధికారానికి దూరం చేశారని విమర్శించారు.అనవసరంగా మైనంపల్లి హనుమంతరావుపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తే కాంగ్రెస్ శ్రేణులు తగిన విధంగా ప్రతిస్పందిస్తాయని హెచ్చరించారు.ప్రజల కోసం నిరంతరం కష్టపడుతూ ప్రజల్లోనే ఉంటూ సేవ చేస్తున్న మా నాయకుడు మైనంపల్లి హనుమంతరావు రాష్ట్రవ్యాప్తంగా వివిధ నియోజకవర్గాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలను చేస్తున్నారని చెప్పారు.మైనంపల్లి పై వ్యాఖ్యలు చేస్తూ చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ నాయకులు తమ తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.రాజకీయ విమర్శలు హద్దులు దాటకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మా నాయకుడు పై హద్దులు దాటి మాట్లాడితే ఖచ్చితంగా తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్ జితేంద్ర నాథ్,బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్,వర్కింగ్ ప్రెసిడెంట్ బి కే శ్రీనివాస్ ఎస్ ఆర్ ప్రసాద్,జి ఎన్ వి సతీష్ కుమార్,పిట్టల శ్రీనివాస్,రాందాస్ సంతోష్ ముదిరాజ్,బాబు సత్యనారాయణ,డివిజన్ అధ్యక్షులు వైనాల ప్రవీణ్ సత్యమూర్తి వినోద్ యాదవ్,లక్ష్మీ,ప్రభా,కుట్టి శ్రీనివాస్,సయ్యద్ మబ్బు,బాల్ పి విసత్యనారాయ ణ, ఫరీద్,పార్థ సారథి,శ్రీకాంత్ ముదిరాజ్,శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక పోలీస్ స్టేషన్ లో న్యాయం జరగకపోతే...

# జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సంప్రదించండి

- ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా ప్రజావాణి కార్యక్రమం.
- ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న జిల్లా ఎస్పీ.
- ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాత విచారణ జరిపి సత్వర న్యాయం అందించాలని అధికారులకు ఆదేశాలు.
- జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి - జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి ప్రతినిధి జూన్ 22:(ప్రజా కలం ):

జిల్లా ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్., ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విని, సంబంధిత అంశాలపై స్థానిక ఎస్.హెచ్.ఓ లతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకొని, ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మీ సమస్యలకు స్థానిక పోలీస్ స్టేషన్‌లలో పరిష్కారం దొరకనప్పుడు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి సేవలు వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.



ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదులపై జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతుందని, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా న్యాయం అందించడమే సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు.

## కనీస వేతనాల సవరణ, అమలు కోసం

# కార్మిక ఐక్య పోరాటాలు

**- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి**

సంగారెడ్డి ప్రతినిధి జూన్ 22 ( ప్రజా కలం):

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కనీస వేతనాల సవరణ శాస్త్రీయంగా లేదని, వాటిని మరోసారి సమీక్షించి సవరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు,గజ్వేల్ పారిశ్రామిక ప్రాంత ఇండస్ట్రియల్ క్లస్టర్ కన్వీనర్ బండ్ల స్వామి డిమాండ్ చేశారు.అనేక పరిశ్రమల్లో కార్మికులు ఇప్పటికీ కనీస వేతనాలు పొందడం లేదని,వారికి చట్టబద్ధమైన వేతనాలు అమలు చేయించే వరకు కార్మిక ఐక్య పోరాటాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలో జరిగిన తెలంగాణ స్టేట్ ఫిక్స్ టర్మ్ అండ్ నాన్-రెగ్యులర్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రథమ మహాసభలో ఆయన మాట్లాడారు.సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్ పారిశ్రామిక ప్రాంతం రోజురోజుకు విస్తరిస్తూ పరిశ్రమలు పెరుగుతున్నప్పటికీ,అక్కడ పనిచేస్తున్న అనేక మంది కార్మికులు కనీస వేతనాలు, కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదని అన్నారు.కొన్ని పరిశ్రమల్లో పండుగలు, అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే) వంటి సందర్భాల్లో కూడా "అత్యవసర సేవలు" పేరుతో పనులు చేయించుకుంటూ, కార్మికులకు చట్టప్రకారం చెల్లించాల్సిన అదనపు వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. అలాగే పనిగంటలను కూడా ఇష్టానుసారంగా పెంచుతున్నారని విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధమవుతోందని, వాటి వల్ల కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా పారిశ్రామిక సంబంధాల కోడ్ ప్రకారం శాశ్వత కార్మికుల స్థానంలో ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో తాత్కాలిక ఉద్యోగులను నియమించుకునే అవకాశాలు పెరిగాయని తెలిపారు.దీనివల్ల ఉద్యోగ భద్రత,కనీస వేతనాలు వంటి హక్కులు




దెబ్బతింటాయని, కార్మికులు యాజమాన్యాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ ఫిక్స్ టర్మ్ అండ్ నాన్-రెగ్యులర్ ఎంప్లాయీస్ యూనియన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ యూనియన్ ద్వారా గజ్వేల్ పారిశ్రామిక ప్రాంతంలోని కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ,బోనస్,చట్టబద్ధమైన సెలవులు తదితర హక్కులు అమలు అయ్యేలా కృషి చేస్తామని చెప్పారు.అలాగే పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవడం, కార్మికులకు రక్షణ పరికరాలు అందించడం కోసం కూడా యూనియన్ పోరాడుతుందని బండ్ల స్వామి తెలిపారు.ఈ మహాసభలో సిఐటియు ఆల్ ఇండియా కోశాధికారి సాయిబాబా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లికార్జున్ పాల్గొన్నారు ఈ మహాసభలో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు రాష్ట్ర కమిటీ లో గజ్వేల్ ప్రాంతం కు చెందిన నాసగోని వేణుగోపాల్ ,ఈ అనిల్ లకు రాష్ట్ర కమిటీ సభ్యులుగా అవకాశం కల్పించారు.

# ఉద్యోగాల్లో స్థానికులకే పెద్దపీట..

**స్థానికులకే తొలి ఉద్యోగాలు: జీఎంఆర్ - సామాజిక బాధ్యత నిధులు పెంచాలి**



అమీన్పూర్, జూన్ 22 (ప్రజా కలం) ప్రతినిధి

సుల్తాన్‌పూర్ మెడికల్ డివైస్ పార్కులో స్థానికులకు ఉద్యోగాల్లో తొలి ప్రాధాన్యం కల్పించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పరిశ్రమల యాజమాన్యాలను కోరారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలని, ప్రజోపయోగ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. సోమవారం సుల్తాన్‌పూర్ మెడికల్ డివైస్ పార్కులోని ఐలా కార్యాలయంలో పరిశ్రమల యాజమాన్యాలు, ఐలా అధికారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్కులో కొనసాగుతున్న పరిశ్రమల కార్యకలాపాలు, ఉద్యోగాల కల్పన, సామాజిక బాధ్యత నిధుల వినియోగంపై చర్చించారు. ప్రస్తుతం 120 పరిశ్రమలు ఉత్పత్తి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి పరిశ్రమ ఉద్యోగాల భర్తీలో స్థానికులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. ఉద్యోగ నియామకాల సమయంలో స్థానిక యువతకు వివిధ మాధ్యమాల ద్వారా సమాచారం అందించాలని కోరారు. అదేవిధంగా ప్రజోపయోగ కార్యక్రమాల కోసం సామాజిక బాధ్యత నిధులు కేటాయించాలని సూచించారు. ఈ అంశాలపై మరింత సమగ్రంగా చర్చించేందుకు జూలై తొలి వారంలో మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, ఐలా కమిషనర్ శ్రీనివాస్, డీఈ సురేందర్, విద్యుత్ శాఖ ఏడీ సంజయ్, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు..

# టీపీటీ కోసం రామకృష్ణ అలుపెరుగని పోరు

**పేదల ఇండ్ల కోసం ప్రభుత్వ భూమి ఇవ్వాలి : రామకృష్ణ - సీఎం,ఎమ్మెల్యేకు చిత్త శుద్ధి ఉందాని ప్రశ్న?**




కంటోన్మెంట్: జూన్ 22: ప్రజా కలం ప్రతినిధి

కంటోన్మెంట్ ప్రాంత ప్రగతిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని, బోర్డుకు రావాల్సిన బకాయిల చెల్లింపుల విషయంలో తాము న్యాయపోరాటం కొనసాగిస్తున్నామని కంటోన్మెంట్ బోర్డు మాజీ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ స్పష్టం చేశారు. కంటోన్మెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన టిపిటి (పన్నుల) బకాయిలపై గతంలో తాను హైకోర్టును ఆశ్రయించగా, ఇటీవల న్యాయస్థానం తెలంగాణ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శికి ఫార్మ్ వన్ జారీ చేసిందని ఆయన వెల్లడించారు. 2023లో తాను నామినేటెడ్ సభ్యుడిగా ఉన్న సమయంలోనే కోర్టును ఆశ్రయించి, అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం నుండి 80 కోట్ల రూపాయల బకాయిలను రాబట్టి కంటోన్మెంట్ అభివృద్ధికి వెచ్చించేలా చేశామని గుర్తుచేశారు. ప్రజల నుండి పన్నుల ద్వారా వసూలయ్యే నిధులను రాష్ట్ర ఖజానాతో పాటు కంటోన్మెంట్ బోర్డుకు ఏకకాలంలో మళ్లిస్తేనే ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

మడ్ ఫోర్డ్ గుడిసెలలో నివాసముంటున్న పేద ప్రజలను కాపాడుకోవాల్సిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులపై ఉందన్న ఆయన,రాష్ట్ర ప్రభుత్వం వెంటనే భూ బదలాయింపు ప్రక్రియను చేపట్టి పేదల పట్ల తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు.ఇదే సమయంలో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సంబంధించి రక్షణ శాఖ భూముల పరిహారం రూపంలో సమకూరిన 303 కోట్ల రూపాయలను కంటోన్మెంట్ ఖాతాలో జమ చేసిన ఘనత కేంద్ర మంత్రులకే దక్కుతుందని కొనియాడారు. మరోవైపు తన రాజకీయ భవిష్యత్తుపై స్పందిస్తూ, తన ఊపిరి ఉన్నంతవరకు భారతీయ జనతా పార్టీలోనే కొనసాగుతానని రామకృష్ణ స్పష్టం చేశారు. పార్టీ నుండి తనను బహిష్కరించిన అంశం ప్రస్తుతం క్రమశిక్షణ కమిటీ పరిధిలో ఉందని, దీనికి సంబంధించిన నిజానిజాలు త్వరలోనే ప్రజల ముందుకు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు

# కాలనీలో ప్రహారి గోడ నిర్మించి ప్రమాదాలు నివారించాలని జోనల్ కమీషనర్ కు వినతి

కూకట్ పల్లి, జూన్ 22, ప్రజా కలం ప్రతినిధి:

అల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ అంబేద్కర్ నగర్ కాలనీ కి ప్రక్కనే ఉన్న పిజెఆర్ నగర్ లో వాంబే పథకంలో భాగంగా నిర్మించిన ఇండ్లు సుమారు 15 అడుగుల కింది భాగంలో ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని సమస్యను పరిష్కరించడానికి ప్రహరీ గోడ నిర్మించాలని అంబేద్కర్ నగర్ కాలనీవాసులు సోమవారం కూకట్ పల్లి జోనల్ కమిషనర్ ను కలిసి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా 15 అడుగుల లోతట్టు ప్రాంతంలో ( కింది భాగంలో ) ఉండడంతో చిన్నారులు ప్రమాదాల బారిన పడుతున్నారని సమస్యను తెలియజేస్తూ అంబేద్కర్ నగర్ కాలనీవాసులు జోనల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు గోపాస్? రవీందర్?, కే దేవయ్య లు మాట్లాడుతూ అంబేద్కర్ నగర్ కాలనీ కి ప్రక్కనే ఉన్న పిజెఆర్ నగర్ వాంబే పథకంలో భాగంగా నిర్మించిన ఇండ్లు సుమారు 15 అడుగుల కింది భాగంలో ఉండడంతో చిన్న పిల్లలు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు కాలనీల మధ్యలో కొంత భాగం వరకు ప్రహరి నిర్మాణం చేపట్టిన అధికారులు సుమారు 200 ఫీట్ల వరకు ఎటువంటి ప్రహరి నిర్మించలేదన్నారు. దీంతో అంబేద్కర్ కాలనీలో గత కొన్ని రోజుల క్రితం ఓ బాలుడు ఆడుకుంటూ కింద పడటంతో




బాలుడికి తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. రెండు కాలనీల ఎత్తులో వ్యత్యాసం ఉండటంతో చిన్నారులు బయటకు వెళ్లి ఆడుకునే వీలు లేకుండా పోయిందని, చిన్నారులు ఎక్కడ కింద పడిపోతారెమో అనే భయంతో తల్లిదండ్రులు బయటకు పంపించాలంటేనే భయపడే పరిస్థితి నెలకొందని కానీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు కాలనీల మధ్య ప్రహరి గోడను నిర్మాణం చేపట్టడమో, లేదా ఫెన్సింగ్ ఏర్పాటు చేయడమో చేయాలని జోనల్ కమిషనర్ ను కోరినట్లు వారు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని గతంలో చాలాసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చిన్నారులు ప్రమాదాల బారిన పడకుండా ఉన్నతాధికారులు త్వరితగతిన సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని ఆశిస్తున్నామన్నారు.

# బీబీకా ఆలంలో టీఆర్ఎస్ అధినేత్రి కవిత ప్రార్థనలు

**మొహర్రం ఏర్పాట్ల పై ప్రభుత్వం నిర్లక్ష్యం, నిధులు ఇవ్వండంలేని ఆరోపణలు**

హైదరాబాద్: జూన్ 22: ప్రజాకలం ప్రతినిధి : మొహర్రం పండుగ ఏర్పాట్లలో ప్రస్తుత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత విమర్శించారు. మొహర్రం సంతాప దినాల సందర్భంగా డబీర్ పురాలోని చారిత్రాత్మక బీబీకా ఆలంను ఆమె సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కర్బాలా మైదానంలో హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన మహోన్నత త్యాగాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.ఆయన చాటిన మానవీయత,సత్యం కోసం చేసిన ప్రాణత్యాగం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని,ఆ స్ఫూర్తితోనే మనమంతా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.నిజాం కాలం నాటి నుంచి హైదరాబాద్ నగరంలో అన్ని వర్గాల ప్రజలు ఏ పండుగనైనా కులమతాలకు అతీతంగా, కలిసిమెలిసి జరుపుకునే గొప్ప గంగా-జమునా తెహజీబ్ సంస్కృతి ఇక్కడ ఉందని కవిత కొనియాడారు.ముఖ్యంగా బీబీకా ఆలం ఊరేగింపులో ఏనుగు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని ఆమె గుర్తుచేశారు. అయితే, ప్రస్తుత పాలనలో ముస్లిం మైనార్టీల సంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. మైనార్టీల కోసం కేటాయింపులు కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయని,బడ్జెట్ నిధులు మాత్రం అసలు విడుదల కావడం లేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నగరంలోని అన్ని అషుర్ ఖానాలకు నిధులను కేటాయించాలని, మైనార్టీలకు సంబంధించిన బడ్జెట్ పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేసి మొహర్రం ఏర్పాట్లను ఘనంగా నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు.



## ఘనంగా అయ్యప్ప స్వామి ఆలయంలో

# ఉత్తర నక్షత్రం పూజలు

గజ్వేల్:22జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం ఉత్తర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు బొగ్గుల సురేష్ మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.భక్తులు విశ్వాసంతో స్వామివారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని తెలిపారు.అయ్యప్ప స్వామి ఆలయం భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతోందని పేర్కొన్నారు. ఆలయంలో ప్రతిరోజూ ఉదయం,సాయంత్రం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ప్రతి నెల ఉత్తర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు



నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రతి ఒక్కరూ దైవభక్తి, సేవాభావంతో జీవించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో నాచారం దేవస్థానం డైరెక్టర్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్,కోశాధికారి నారాయణరెడ్డి, మర్యాల శ్రీనివాస్,గందె యాదగిరి, కొండపాక శ్రీనివాస్,కైలాస ప్రశాంత్, సిద్ధి రామచంద్రం,సిరిపురం సత్యనారాయణ,ఆంజనేయులు, విక్రాంత్,గార్గ దీపక్,సత్యం,ఎర్రవాడ యాదగిరి,లక్ష్మీనర్సయ్య,ప్రవీణ్,గందె సంతోష్,ఉప్పల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ సదస్సు.. ఓటు రక్షణ పిలుపు..

### పటాన్‌చెరులో ఎస్ఐఆర్ సదస్సు.. ఓటు హక్కు రక్షణపై పిలుపు..



పటాన్‌చెరు జూన్ 22 (ప్రజా కలం) ప్రతినిధి ఓటరు హక్కుల పరిరక్షణ, ఓటరు జాబితా శుద్ధి, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్) ప్రధాన లక్ష్యమని అవగాహన కల్పించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జూన్ 25 నుంచి ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ కార్యక్రమంపై ఓటర్లలో చైతన్యం పెంపొందించేందుకు పటాన్‌చెరులోని పీవీ నరసింహారావు ఆడిటోరియంలో ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశం, అవగాహన సదస్సులో ఎండీఆర్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులకు ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు విధానం, ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల సవరణ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించారు. మాద్రి పృథ్వీరాజ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. జూన్ 25 నుంచి జూలై 25 వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు చురుకుగా పాల్గొని తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారులను లేదా బూత్ స్థాయి ప్రతినిధులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో గూడెం మధుసూదన్, మెట్టు కుమార్ యాదవ్, విజయ్, వంగరి అశోక్, తహశీల్దార్ హరిబాబు, డిప్యూటీ తహశీల్దార్ షఫీ, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, తదితరులు పాల్గొన్నారు..

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విజయవంతం

### జిల్లా యంత్రాంగానికి ప్రత్యేక అధికారి అభినందనలు

సిద్దిపేట ప్రజాకలం జూన్ 22 : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించినందుకు జిల్లా యంత్రాంగాన్ని జిల్లా ప్రత్యేక అధికారి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్ (ఐఏఎస్) అభినందించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, సీపీ సాధన రష్మీ పెరుమాళ్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మార్చి 16 నుంచి



జూన్ 12 వరకు జిల్లాలో అమలైన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటో ప్రదర్శనను పరిశీలించిన ఆయన, నివేదికలను అధ్యయనం చేసి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసిన జిల్లా కలెక్టర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల పురోగతిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు సమర్పించగా, ఫిర్యాదుల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై పలు సూచనలు చేశారు. జిల్లాలో గ్రామ, వార్డు, మండల సభల ద్వారా సుమారు 19 వేల ఫిర్యాదులు స్వీకరించామని, వాటిని నిర్ణీత గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్థానికంగా పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించి, ఉన్నతస్థాయి పరిష్కారం అవసరమైన అంశాలను సంబంధిత శాఖలకు పంపించాలని సూచించారు. సామాజిక పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, వానాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే జిల్లాలో సాధించిన పురోగతి, పెండింగ్ సమస్యలు, విజయగాథలతో కూడిన సమగ్ర బుక్‌లెట్ సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ, అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని, ప్రత్యేక అధికారి సూచనల మేరకు సమస్యల పరిష్కారానికి శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికలు అమలు చేస్తామని తెలిపారు. సమావేశం అనంతరం ప్రత్యేక అధికారి "నషా ముక్త్ భారత్" పోస్టర్‌ను ఆవిష్కరించగా, జిల్లా కలెక్టర్ చేర్యాల పెయింటింగ్‌ను అందజేసి సత్కరించారు. సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

### - ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
### - రాజేంద్రనగర్ శాసనసభ్యులు ఎమ్మెల్యే ప్రకాష్



రాజేంద్రనగర్, జూన్ 22, (ప్రజా కలం) మహిళల ఆర్థిక, సామాజిక ఉన్నతే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాజేంద్రనగర్ శాసనసభ్యులు ఎమ్మెల్యే శ్రీ ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో "ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ" కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల సాధికారత, వారి ఉన్నతే తెలంగాణ ప్రగతికి అసలైన నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఇందిరా మహిళా శక్తి పథకాలు ప్రతి మహిళకూ అండగా నిలుస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గం లోని మహిళలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సదరు కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో మహిళలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

### 23 ఫిర్యాదుల స్వీకరణ – త్వరితగతిన పరిష్కరించాలన్న అదనపు ఎస్పీ చంద్రయ్య

రాజన్నసిరిసిల్ల, జూన్ 22 ( ప్రజా కలం ప్రతినిధి): ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 23 ఫిర్యాదులను అదనపు ఎస్పీ చంద్రయ్య స్వీకరించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అందిన ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో అదనపు ఎస్పీ ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బాధితుల సమస్యలను చట్టపరంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వినతులు, ఫిర్యాదులను స్వీకరించి అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ




చేపట్టి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ఫిర్యాదుదారుల్లో పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం పెంపొందించేలా పని చేయాలని పేర్కొన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ వాటి పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని తెలిపారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా పరిష్కారం కల్పించేందుకు కృషి చేస్తున్నామని అదనపు ఎస్పీ చంద్రయ్య వెల్లడించారు.

## వేములవాడ ఆలయంలో వివాదం..

### ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన కౌన్సిలర్ ముత్యం

#### – దేవస్థానం ఈవోతో పాటు 30 మంది సిబ్బందిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్




వేములవాడ, జూన్ 22 ప్రజా కలం ప్రతినిధి :వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో అధికార దుర్వినియోగం చోటుచేసుకుందని ఆరోపిస్తూ ఆలయ ఈవో రమాదేవితో పాటు సుమారు 30 మంది సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మోచీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, 17వ వార్డు కౌన్సిలర్ కొండ్లెపు ముత్యం డిమాండ్ చేశారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్లతో కలిసి జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఇటీవల తనపై జరిగిన ఘటనను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి సంబంధిత అధికారులతో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ముత్యం తెలిపారు. అనంతరం కౌన్సిలర్ ముత్యం మాట్లాడుతూ, తాను దళితుడిననే కారణంతో ఉద్దేశపూర్వకంగా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. స్వశక్తితో జీవనోపాధి సాగిస్తున్న తనపై ఆలయ ఈవో ఆదేశాల మేరకు సుమారు 30 మంది ఆలయ సిబ్బంది గుంపుగా వచ్చి దౌర్జన్యానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. తన గౌరవాన్ని దెబ్బతీసేలా, ప్రజల ముందు అవమానించేలా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం 16వ వార్డు కౌన్సిలర్ వంగల శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజల సేవకు నియమితులైన అధికారులు చట్టబద్ధంగా వ్యవహరించాల్సిందిపోయి ప్రజాప్రతినిధులను కులం పేరుతో అవమానించడం బాధాకరమన్నారు. ఏదైనా ఆక్రమణ లేదా అక్రమ నిర్మాణం ఉందని భావిస్తే చట్టపరమైన నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని, అధికార బలప్రదర్శనకు పాల్పడడం సమంజసం కాదన్నారు. దళిత ప్రజాప్రతినిధిపై కక్షసాధింపు చర్యలకు బదులుగా భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై దేవస్థానం దృష్టి సారించాలని సూచించారు. క్యూలైన్లలో తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, జాతర గ్రౌండ్‌లోని వ్యాపారుల నుంచి లక్షల రూపాయల అద్దెలు వసూలు చేస్తున్నప్పటికీ తగిన సౌకర్యాలు కల్పించడంలో దేవస్థానం విఫలమైందని విమర్శించారు. వ్యక్తిగత కక్షలకు తావులేకుండా విధి నిర్వహణలో పారదర్శకత పాటించాలని, జరిగిన ఘటనపై ఆలయ అధికారులు స్పందించి ముత్యానికి క్షమాపణ చెప్పాలని బీజేపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మైలారం శ్రీనివాస్, బోనాల శివ లక్ష్మీనారాయణతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గో టు విలేజ్..ప్రతి మాదిగ పల్లెకు తరలండి

### ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం

### ఎం ఎస్ పి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రావు గల బాబు మాదిగ

మహేశ్వరం, జూన్ 22, (ప్రజా కలం)

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మహేశ్వరం మండలం కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది. గో టు విలేజ్ ప్రతి మాదిగ పల్లెకు తరలండి జులై 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించండి అని ఎం ఎస్ పి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రావు గల బాబు మాదిగ మహేశ్వరం మండల ఇన్చార్జి బక్కని రవి మాదిగ ఎమ్మార్పీఎస్ మండల్ అధ్యక్షుడు ఎర్ర గణేష్ మాదిగ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు విద్యా , సంస్థగత నిర్మాణం , జెండా ఆవిష్కరణల కోసం మాదిగ పల్లెల్లోకి ప్రతి ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి మరియు అనుబంధ సంఘాల నాయకులు వెళ్లి అక్కడి మాదిగ యువతను చైతన్యం చేసే విధంగా ముందుకు సాగాలని ఎస్సీల వర్గీకరణ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్లు పోరాటం చేసి వర్గీకరణ సాధించుకున్నామని ఈ సాధించుకున్న వర్గీకరణ ఫలాలను మన జాతి బిడ్డలు



అందిపుచ్చుకునేలా మహేశ్వరం మండలంలోని ప్రతి గ్రామంలో చైతన్య సమావేశాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అదేవిధంగా మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం జూలై 7 ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు జరిపించి ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. ఎంఎస్పి జిల్లా అధ్యక్షుడు రావు గళ్ళ బాబు మాదిగ ఎమ్మార్పీఎస్ మండల్ ఇన్చార్జి బక్కని రవి మాదిగ ఎమ్మార్పీఎస్ మండల్ అధ్యక్షుడు ఎర్ర గణేష్ మాదిగ మండల్ కార్యదర్శి నడి కూడా అర్జున్ మాదిగ వర్కల కుమార్ కిరణ్ కుమార్ పెండ్యాల మల్లేష్ కొండని చందు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

### - జిల్లా కలెక్టర్‌కు పెన్షనర్స్ అసోసియేషన్ వినతిపత్రం



సిద్ధిపేట ప్రజాకలం జూన్ 22.

తెలంగాణ రాష్ట్రంలోని పెన్షనర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సిద్ధిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు చిల్ల నరసింహులు, ప్రధాన కార్యదర్శి బోరెడ్డి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ప్రభుత్వ అభివృద్ధికి విశేష సేవలు అందించారని, ప్రస్తుతం వృద్ధాప్యంలో ఆరోగ్య, ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నందున ప్రభుత్వం వారి సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పెన్షనర్లకు నగదు రహిత వైద్య సేవల కోసం హెల్త్ కార్డులు మంజూరు చేయడం, పెండింగ్ డీఏ బకాయిలు విడుదల చేయడం, స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వడం, పీఆర్సీని 51 శాతం ఫిట్‌మెంట్‌తో 2023 జూలై 1 నుంచి అమలు చేయడం వంటి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. పెన్షనర్ల సంక్షేమం కోసం పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జోగు బిక్షపతి, జిల్లా కమిటీ సభ్యులు నాగేందర్, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, హనుమంతరెడ్డి, అన్నమరెడ్డి, పరశురాములు, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

## కె ఆర్ ఆర్ హిల్స్ కాలనీ లో శ్రీ పల్లవి లేడీస్ కార్నర్ షాపు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి

మహేశ్వరం, జూన్ 22, (ప్రజా కలం)



కె ఆర్ ఆర్ హిల్స్ అల్మాస్గూడ బాలాపూర్ మండలం బాలాపూర్ మండలంలో గల అల్మాస్గూడ కె ఆర్ ఆర్ హిల్స్ కాలనీ లో శ్రీ పల్లవి లేడీస్ కార్నర్ షాపు ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళలను అన్ని రంగాలలో ప్రోత్సహించాలని వారు వారి సొంత కాళ్లపై నిలబడి సమాజంలో తలెత్తుకొని తిరగాలని మహిళా శక్తి ధృడపడాలని ఆకాంక్షిస్తూ వారి షాపు దినదిన అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ కార్యక్రమానికి బి రాధిక బి చంద్రిక బాలాపూర్ మండల మహిళా ప్రధాన కార్యదర్శి బి యాదమ్మ హాజరై మహిళలను ప్రోత్సహించాలని మహిళలు అన్ని రంగంలో ముందుండాలని అన్నారు.

## గీతం క్యాంపస్‌లో యోగా వెలుగు..

### ఆరోగ్య జీవనానికి గీతం యోగా సందేశం..




పటాన్‌చెరు జూన్ 22 (ప్రజా కలం )

ఆరోగ్యకరమైన వృద్ధాప్యం, మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వమే లక్ష్యంగా గీతం విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఉత్సాహంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ క్రీడా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా సాధన చేశారు. ప్రాంగణంలోని గాంధీ చౌక్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమం 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా' అనే ఈ ఏడాది ప్రధాన అంశానికి అనుగుణంగా సాగింది. యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించిన అనంతరం కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ సూచించిన సాధారణ యోగా విధానాన్ని అనుసరించి యోగాసనాలు, కపాలభాతి, ప్రాణాయామం, ధ్యానం నిర్వహించారు. క్రమం తప్పని యోగా సాధన వల్ల శారీరక ఆరోగ్యం, మానసిక స్థైర్యం, ఒత్తిడి నియంత్రణ, వ్యాధుల నివారణ సాధ్యమవుతాయని శిక్షకులు వివరించారు. అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు, నివాస సంచాలకుడు డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం–ప్రాంగణ జీవన విభాగం సంచాలకురాలు అంబికా ఫిలిప్‌తో పాటు పలువురు విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పాల్గొన్న వారికి ప్రత్యేక దుస్తులు పంపిణీ చేశారు. సామూహిక చిత్రీకరణ, అల్పాహారంతో కార్యక్రమం ముగిసింది.

## సివిల్ సప్లై గోదాం లో 'వే' బ్రిడ్జి ఏర్పాటు చేయండి

### – రేషన్ డీలర్ల వినతి మేరకు నిర్మలా జగ్గారెడ్డి తరపున కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించిన టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్



సంగారెడ్డి ప్రతినిధి జూన్ 22(ప్రజా కలం):సివిల్ సప్లై ఎంఎల్ఎస్ పాయింట్ లో గత కొన్ని సంవత్సరాలుగా సరైన తూకం పరికరాలు లేకపోవడంతో నష్ట పోతున్నామని సంగారెడ్డి రేషన్ డీలర్లు వాపోతున్నారు. తూకం సరిగా వేయకపోవడం తో రేషన్ బియ్యం తక్కువగా వస్తున్నాయని, దీనివల్ల నష్టాలు వస్తున్నాయని టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు ఎం ఎల్ ఎస్ పాయింట్ లో వే బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ఆమె కలెక్టర్ కు లేఖ రాశారు. సోమవారం టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్ ఆ లేఖను రేషన్ డీలర్ల తో కలిసి సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్ కు అందించారు. ఈ కార్యక్రమం లో కంది మండల్ రేషన్ డీలర్ల ప్రెసిడెంట్ శంకర్ మరియు శశికాంత్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## దౌల్తాబాద్‌లో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు స్థల పరిశీలన

### - గ్రామీణ విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: చెరుకు శ్రీనివాస్ రెడ్డి




సిద్దిపేట ప్రజాకలం జూన్ 22. దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి శనివారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో ప్రతిపాదిత తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యా అవకాశాలను బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. దౌల్తాబాద్‌లో సుమారు రూ.24 కోట్ల వ్యయంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరైందని, అత్యాధునిక అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులతో ఈ విద్యాసంస్థను నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు సెమీ రెసిడెన్షియల్ విధానంలో విద్య అందించేలా పాఠశాలను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. పాఠశాలలో స్మార్ట్ తరగతి గదులు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, డిజిటల్ లైబ్రరీ, క్రీడా మైదానాలు, విద్యార్థుల వసతి సదుపాయాలు వంటి ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ పాఠశాల ఏర్పాటుతో దౌల్తాబాద్ మండలంతో పాటు పరిసర గ్రామాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. స్థల పరిశీలన కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మూసేసిన కల్వర్టులు.. మూగబోయిన అధికారులు

- ప్రజా సమస్యలపై వార్తలు వస్తున్నాయి, ఫిర్యాదులు వెళ్తున్నాయి
- కానీ అధికారులు మాత్రం స్పందించడం లేదు
- పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, సంబంధిత శాఖల నిర్లక్ష్య వైఖరి






జూన్ 22 ఐనవోలు :-(ప్రజా కలం ప్రతినిధి) ఐనవోలు మండల కేంద్రం ఒంటిమామిడి పల్లి పరిధిలో సహజ సిద్ధ నీటి ప్రవాహ మార్గాలను అడ్డుకుంటూ జరిగిన ఆక్రమణల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, సంబంధిత శాఖల నిర్లక్ష్య వైఖరి ప్రజల్లో ఆగ్రహానికి కారణమవుతోంది. వంటిమామిడిపల్లి -- మండల కేంద్రం అయినవోలు నుండి ఒంటిమామిడి పల్లి మీదుగా వెళ్లే వెంకటాపురం రోడ్డుకు ఉన్న బబ్బురు వారి దగ్గర మరియు భరోడా బ్యాంక్ ముందు ఉన్న కల్వర్ట్ లు పూర్తిగా ఆక్రమణలకు గురికావడంతో దిగువ ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అని ప్రజాకలం దినపత్రికలో వెలువడిన కథనం ద్వారా సమస్య వెలుగులోకి వచ్చినా, ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో ఎలాంటి పరిశీలన జరిగిన దాఖలాలు కనిపించడం లేదు. జిల్లా ప్రజావాణి ద్వారా ఫిర్యాదు నమోదైందని రసీదు ఉన్నప్పటికీ, బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు ఎందుకు ఆలస్యం చేస్తున్నారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**కల్వర్టుల మరమ్మతుల బాధ్యత ఎవరిది?**

ఆర్ అండ్ బి శాఖ ఆధీనంలో ఉన్న రోడ్ల కింద నిర్మించిన కల్వర్టులు, డ్రైనేజీ మార్గాలు, వంతెనల నిర్వహణ, మరమ్మతులు, పునరుద్ధరణ వంటి పనులు ఆర్ అండ్ బి శాఖ పరిధిలోకే వస్తాయి. కల్వర్టులు మూసుకుపోవడం, దెబ్బతినడం లేదా నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడితే వాటిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవడం ఆ శాఖ అధికారుల బాధ్యత.అయితే కల్వర్టుల కింద లేదా పక్కన వ్యక్తులు అక్రమంగా ఆక్రమణలు చేసి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటే, ఆ విషయంపై రెవెన్యూ శాఖ, పంచాయతీ రాజ్ శాఖ, స్థానిక సంస్థలు మరియు అవసరమైతే పోలీసు శాఖ సమన్వయంతో చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

**సహజ వరద నీటి ప్రవాహానికి అడ్డుకట్టలు**

వర్షాకాలంలో వరద నీరు సహజంగా వెళ్లే మార్గాలను ఆక్రమించి కంచెలు వేయడం, మట్టిపోసి దారులు మూసివేయడం, కల్వర్టులను నిరుపయోగంగా మార్చడం చట్టవిరుద్ధం. ఇలాంటి చర్యల వల్ల రైతుల పొలాలు ముంపుకు గురవడం, భూగర్భ జలాలు ప్రభావితం కావడం, రోడ్లు దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ప్రభుత్వ భూములు, కాలువలు, వాగు మార్గాలు లేదా నీటి ప్రవాహ వ్యవస్థలను ఆక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులదే. కానీ కొందరు ప్రభావశీలుల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు చూస్తూ ఊరుకోవడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది.

**అధికారుల మౌనం ఎందుకు?**

ప్రజావాణి ఫిర్యాదు నమోదై రోజులు గడుస్తున్నా స్పందన లేకపోవడం పరిపాలనా వైఫల్యానికి నిదర్శనం. సమస్యను గుర్తించేందుకు ఒక క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించడం కూడా అధికారులకు సాధ్యం కాకపోవడం విచారకరం. ప్రజల పన్నుల డబ్బుతో జీతాలు తీసుకుంటున్న అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ప్రజలు ఎవరిని ఆశ్రయించాలి? వార్తలు వచ్చిన తర్వాత కూడా స్పందించని అధికారులు, ఫిర్యాదులను పట్టించుకోని సంబంధిత శాఖలు వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి:

కల్వర్టుల ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయాలి.
సహజ నీటి ప్రవాహ మార్గాలను గుర్తించాలి.
జరిగిన ఆక్రమణలను తొలగించాలి.
బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.
ముంపు రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలి. ప్రజా సమస్యలపై మౌనం పాటించడం పరిపాలన కాదు. సహజ నీటి ప్రవాహాలను కాపాడటం, ప్రభుత్వ ఆస్తులను రక్షించడం, రైతుల హక్కులను నిలబెట్టడం ప్రభుత్వ యంత్రాంగం యొక్క ప్రాథమిక బాధ్యత. ఇకనైనా అధికారులు నిద్రలేచి చర్యలు తీసుకుంటారా? లేక ఫిర్యాదులు, వార్తలు, వినతిపత్రాలు కాగితాలకే పరిమితం అవుతాయా అన్నది చూడాలి.

దాతల సహకారంతో

# ఆగని సేవ యజ్ఞం

- నిరంతరం అన్నదానం 1899 రోజులు మైలురాయి
- రాజన్న ఆలయం వద్ద సేవా కార్యక్రమం




వేములవాడ, జూన్ 22 ప్రజా కలం ప్రతినిధి : దాతల సహకారంతో 'మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో 1899 రోజులుగా నిరంతరంగా కొనసాగుతున్న అన్నదాన సేవా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. లక్ష్మీగణపతి రాజన్న భీమేశ్వర ఆలయం వద్ద పేదలు, అన్నార్తులకు భోజనం అందించడంతో పాటు వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. పుట్టినరోజు సందర్భంగా దోర్నాల నరేంద్ర-లలిత దంపతులు నేటి అన్నదాతలుగా సేవలందించగా, సోమవారం రోజున పేదలకు అన్నదానం చేయాలనే సంకల్పంతో జగిత్యాల వాస్తవ్యులు నల్ల వసంత-సతీష్ దంపతులు సహకారం అందించారు. శాశ్వత దాతలుగా డాక్టర్ జువ్వాడి వెంకటేశ్వర రావు-స్నేహలత దంపతులు, ప్రతాప స్వప్న-సంపత్ దంపతులు, నగుబోతు రవీందర్-జ్యోతి దంపతులు, గణాచారి మఠం శైలజ-సాంబశివు దంపతులు, దేవరాజు ఉమ-బాలచందర్‌రాజు దంపతులు, రామడుగు శ్రీలత కుటుంబ సభ్యులు సహకరిస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు తదితర సందర్భాల్లో అన్నదానం చేయాలనుకునే దాతలు ట్రస్ట్ సభ్యులను లేదా 92469 39388 నంబర్‌ను సంప్రదించాలని ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేష్ కోరారు. కార్యక్రమంలో ప్రతాప నటరాజు, పసుల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మెనూకు తగ్గట్లే భోజనం..

# నాణ్యతలో రాజీ వద్దు..

- మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



రాజన్న సిరిసిల్ల, జూన్ 22 ( ప్రజా కలం ప్రతినిధి) :

విద్యార్థులకు మెనూకు తగ్గట్లే భోజనం ఉండాలని నాణ్యతలో రాజీ వద్దని, అలాగే విద్యాలయం, హాస్టల్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం తంగళ్ళపల్లిలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల విద్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ముందుగా డైనింగ్ హాల్‌ను సందర్శించిన కలెక్టర్, భోజనం చేస్తున్న విద్యార్థినులతో మాట్లాడి వారికి వడ్డిస్తున్న ఆహార పదార్థాల గురించి తెలుసుకున్నారు. మెనూ చార్ట్‌ను పరిశీలించి, అందుకు అనుగుణంగా భోజనం అందిస్తున్నారా అనే విషయంపై అధికారులను అడిగి వివరాలు సేకరించారు. అనంతరం కిచెన్, గోదాంను పరిశీలించి బియ్యం, పప్పులు తదితర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు.విద్యాలయంలో హాజరైన విద్యార్థుల సంఖ్యపై ఆరా తీసిన కలెక్టర్, వసతి గదులు, మరుగుదొడ్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులందరూ క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, విద్యాలయం, హాస్టల్ ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు స్పష్టం చేశారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలి

- మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



సంగారెడ్డి జిల్లా,మహేశ్వరం, జూన్ 22, (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లాలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను రాజకీయాలకు అతీతంగా, పూర్తిస్థాయి పారదర్శకతతో అందజేయాలని కోరుతూ మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ సురభి వాణి దేవి గారు, క్యామ మల్లేష్ ఇతర నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు గౌరవప్రదమైన జీవనం అందించాలనే లక్ష్యంతో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పంపిణీలో ఎలాంటి వివక్ష, ఆలస్యం లేదా రాజకీయ ప్రాధాన్యతలకు అవకాశం ఉండకూడదన్నారు. నిజంగా అర్హత కలిగిన కుటుంబాలకు మాత్రమే ఇండ్లు అందేలా స్పష్టమైన ప్రమాణాలతో ఎంపిక ప్రక్రియ చేపట్టాలని అధికారులను కోరారు.రంగారెడ్డి జిల్లాలో ఎంతోకాలంగా ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న వేలాది కుటుంబాల ఆశలను ప్రభుత్వం గౌరవించాలని, లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటించాలని ఆమె పేర్కొన్నారు. ప్రజల్లో అనుమానాలకు తావులేకుండా అర్హుల జాబితాలను బహిరంగంగా ప్రకటించి, న్యాయమైన విధానంలో ఇండ్ల కేటాయింపు జరగాలని సూచించారు.ప్రభుత్వ పథకాలు ప్రజల హక్కులు వాటి అమలులో రాజకీయాలు కాకుండా అర్హతే ప్రమాణంగా ఉండాలి. ప్రతి అర్హుడికి న్యాయం జరిగే వరకు ప్రజల తరఫున మా పోరాటం కొనసాగుతుంది" అని సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## కందుకూర్ మండలం లో విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

కందుకూరు, జూన్ 22,(ప్రజా కలం) కందుకూర్ మండలం లో విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందాడు మృతుని తండ్రి నేనవత్ లచ్చీరామ్ ఇచ్చిన పిర్యాదు ప్రకారం, ఆయన కుమారుడు నేనావత్ గణేష్ నాయక్ (17 సంవత్సరాలు) చదువు మానివేసి విద్యుత్ పనులు నేర్చుకుంటూ, గత ఒక సంవత్సరం నుండి మర్రిగూడ మండలం, యెరుగండ్లపల్లి గ్రామానికి చెందిన నాగార్జున రెడ్డి వద్ద ఎలక్ట్రికల్ లేబరర్‌గా పనిచేస్తున్నాడు.సాధారణంగా విధులకు వెళ్లిన గణేష్, 21.06.2026 తేదీన చిప్పలపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 93, 94లలో ఉన్న వ్యవసాయ భూమిలో విద్యుత్ తీగలు బిగించే పనిలో పాల్గొన్నాడు. సాయంత్రం సుమారు 4:45 గంటల సమయంలో విద్యుత్ స్తంభం ఎక్కి తీగలు బిగిస్తున్న సమయంలో స్తంభం వంగిపోవడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రవాహం ఉన్న తీగను తాకి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గాయపడిన గణేష్‌ను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రి, మహేశ్వరం కు తరలించగా, విధి నిర్వహణలో ఉన్న వైద్యులు అతడిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. ఫిర్యాదుదారు ఆరోపణల ప్రకారం, సంబంధిత కాంట్రాక్టర్లు సరైన భద్రతా చర్యలు తీసుకోకుండా, కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలు అందించకుండా పనులు చేయించారని, వారి నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగి గణేష్ మృతి చెందాడని పేర్కొన్నారు.ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# గ్రామంలో నిరుపేదలు ఉన్న ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలి

## రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి కి వినతి పత్రం అందజేసిన మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్



మహేశ్వరం, జూన్ 22, (ప్రజా కలం) గ్రామంలో నిరుపేదలు ఉన్న ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి కి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తో కలిసి మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ వినతి పత్రం అందజేశారు. సోమవారం నాడు కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్,ఉప సర్పంచ్ జొరాల రమేష్, స్థానిక సమస్యలపై గ్రామంలో నిరుపేదలు ఉన్నటువంటి ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు నకు, మహేశ్వరం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సి బాలికల వసతి గృహమును 100 పడకల నుండి 200 పడకల వరకు పెంచాలని,

టి జి మోడల్ స్కూల్ నందు విద్యార్థులకు త్రాగునీటి సౌకర్యం కోసం ఆర్ ఓ ప్లాంట్ ఏర్పాటు చేయుటకు, అదేవిధముగా గ్రామంలోని మెట్ల బావి, గడికోట ప్రాంగణ మును సి ఎస్ ఆర్ నిధులతోటి అభివృద్ధి పరిచి పర్యాటక కేంద్రమంగా మార్చుటకు స్థానిక శాసన సభ్యురాలు మాజీ విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సహకారంతో జిల్లా కల్లెక్టర్ రంగారెడ్డి కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. సమస్యలపై కల్లెక్టర్ రంగారెడ్డి జిల్లా సానుకూలంగా స్పందిస్తూ అంశాలకు సంబంధించి నిధుల మంజూరుకు ఆమోదం తెలిపారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ మహేశ్వరం పరిధిలో నిరుపేదలైన, అర్హులైన స్థానిక ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించడం జరుగుతుందని అదేవిధమంగా గ్రామంలోని అభివృద్ధి పనులకు నిధుల మంజూరు చేసే విదంగా ప్రభుత్వం పై వత్తిడి తెచ్చి గ్రామానికి మరింత అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు.

గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా

# వంటేరు కొండల్ రెడ్డి నియామకం



గజ్వేల్:22 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వంటేరు కొండల్ రెడ్డి నియమితులయ్యారు.ఈ విషయాన్ని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి అధికారిక ప్రకటన ద్వారా వెల్లడించారు.గజ్వేల్ పట్టణంలో పార్టీ బలోపేతానికి,కాంగ్రెస్ శ్రేణుల మధ్య సమన్వయాన్ని పెంపొందించేందుకు వంటేరు కొండల్ రెడ్డి నాయకత్వం సమర్థవంతంగా దోహదపడుతుందని ఆంక్ష రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలు,కాంగ్రెస్ పార్టీ ఆశయాలు మరియు విధానాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని ఆమె పిలుపునిచ్చారు.తన నియామకానికి సహకరించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి,గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి,పార్టీ రాష్ట్ర నాయకత్వం,స్థానిక నాయకులకు వంటేరు కొండల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ,గజ్వేల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం మరియు విజయానికి అహర్నిశలు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by Kalakonda Ramakrishna, Printed at TEJOMAI PUBLICATION H.NO.2-24/98/B L N COLONY ,IDA UPPAL MEDCHAL-MALKAJGIRI, HYDERABAD,"TELANGANA - 500013. , Published from H.NO.10-1-7, BADA BAZAR, BESIDE POTHALINGAIAH TEMPLE, AZAM ROAD, NIZAMABAD, TELANGANA - 503001."Editor: Kalakonda Ramakrishna, PRGI.No. TELTEL/2010/33275, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com